


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 152, పేజీలు - 08

సోమవారం, నవంబర్ 10, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD


# బండ్లగూడ భూ బాగోతం



**ఆర్డీవో నివేదిక బుట్టదాఖలు.. కలెక్టర్ మౌనంపై సర్వత్రా విమర్శలు!**

- 'పక్కా కుంభకోణం' అని కీసర ఆర్డీవో స్పష్టం చేసినా.. చర్యలు తీసుకోని మేడ్చల్ జిల్లా యంత్రాంగం
- దొంగ పత్రాలతో వందల కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా.. బ్యాంకులకు భారీ మోసం
- అక్రమ స్థలంలో "పల్లవి డి.బి.ఆర్ గార్డెనియా" నిర్మాణం.. నాణ్యత గాలికి
- నిర్మాణం కూలితే అది 'ప్రభుత్వ హత్యే'నని సామాజిక కార్యకర్తల తీవ్ర హెచ్చరిక
- భూమిని తక్షణమే స్వాధీనం చేసుకుని, అక్రమ అనుమతులు రద్దు చేయాలని సామాజిక కార్యకర్త బాబా గౌడ్ డిమాండ్

**వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి.. దొంగ పత్రాలతో కొందరి పరమవుతుంటే, అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం 'బండ్లగూడ భూ బాగోతం'లోని ప్రధాన ఘట్టం. సాక్షాత్తూ రెవెన్యూ అధికారి (ఆర్డీవో) 'ఇది పక్కా కుంభకోణం' అని నివేదిక ఇచ్చినా, జిల్లా కలెక్టర్ మౌనం వహించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూమిని కాజేయడమే కాక, అదే స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టి అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ 'బహుముఖ వంచన'పై సామజిక కార్యకర్త బాబా గౌడ్ "ప్రజా ప్రశ్న" కు అందిస్తున్న విశ్లేషణ ఇది.**






మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్
**మిక్కిలినేని మను చౌదరి**

**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని, స్వాతంత్ర్య సమరయోధుల పేరుతో సృష్టించిన దొంగ పత్రాలతో కొందరు అక్రమార్కులు కాజేస్తున్న వైనంపై "ప్రజా ప్రశ్న దిన పత్రిక", గత కొద్దికాలంగా వరుస కథనాలను ప్రచురిస్తున్న విషయం విదితమే. ఈ బాగోతంపై సాక్షాత్తూ కీసర ఆర్డీవో విచారణ జరిపి 'ఇది పక్కా కుంభకోణం' అని జిల్లా కలెక్టర్‌కు స్పష్టమైన నివేదిక ఇచ్చారు. కానీ, ఆ నివేదిక అంది వారాలు గడుస్తున్నా, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఆంతర్యమేమిటని సామజిక కార్యకర్త బాబా గౌడ్ నిలదీస్తున్నారు. బండ్లగూడ సర్వే నెం. 36/5లోని 10 ఎకరాల భూమిని కాజేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలో, ఆ భూమిని స్వాధీనం చేసుకోవడంలో జిల్లా యంత్రాంగం చూపుతున్న ఈ ఘోర నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కుంభకోణం మూలాలు.. ఆర్డీవో నివేదికలోని నిజాలు..

ఆర్డీవో నివేదిక ధృవీకరించిన వివరాల ప్రకారం.. ఉప్పల్ మండలం బండ్లగూడ గ్రామం సర్వే నెం. 36/5లో 10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమి ఉంది. 'రాచకొండ కనకయ్య' అనే వ్యక్తి పేరు మీద, స్వాతంత్ర్య సమరయోధుడి కోటాలో కేటాయించినట్లు బూటకపు పత్రాలు సృష్టించారు. ఈ నకిలీ పత్రాల ఆధారంగా, కొందరు అవినీతి అధికారుల అండతో తప్పుడు ఎన్‌ఓసిలు పొంది, ఏకంగా ఈ ప్రభుత్వ భూమిని ఎస్‌బిఐ, కెనరా బ్యాంక్, యుకో బ్యాంక్ వంటి జాతీయ బ్యాంకుల్లో, ప్రైవేట్ బ్యాంకుల్లో తనఖా పెట్టి కోట్లాది రూపాయల రుణాలు పొందారు.సామాజిక కార్యకర్త పట్నం బాబా గౌడ్ ఫిర్యాదు మేరకు, కలెక్టర్ ఆదేశాలతోనే కీసర ఆర్డీవో సమగ్ర విచారణ చేపట్టారు. ఆర్డీవో తన నివేదికలో ఇది స్పష్టమైన భూ కబ్జా అని, సదరు పత్రాలన్నీ బోగస్ అని తేల్చిచెప్పారు.

### ఇది "బహుముఖ వంచన"

ఈ కుంభకోణాన్ని లోతుగా విశ్లేషించినప్పుడు, ఇది ఒక "బహుముఖ వంచన"గా స్పష్టమవుతోంది.

**ప్రభుత్వానికి నష్టం:** వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైంది.

**బ్యాంకులకు నష్టం:** ప్రభుత్వ భూమిని తనఖా పెట్టి పొందిన రుణాలు.. తక్షణమే "రాని బాకీలు "గా మారి ప్రజాధనానికి భారీ గండి కొట్టనున్నాయి.

**ప్రజలకు నష్టం:** ఇదే అక్రమ స్థలంలో "పల్లవి డి.వి.ఆర్ గార్డెనియా" పేరుతో బహుళ అంతస్తుల భవనానికి అనుమతులు పొంది, నాణ్యతా ప్రమాణాలు గాలికొదిలి వందలాది మంది అమాయక ప్రజలకు ఫ్లాట్లను విక్రయిస్తున్నారు.

### కలెక్టర్ మౌనం వెనుక మర్మమేమిటి.?

సొంత దర్యాప్తు సంస్థ (కీసర ఆర్డీవో) చేతికి స్పష్టమైన ఆధారాలు, నివేదిక ఇచ్చినప్పటికీ, జిల్లా కలెక్టర్ ఎందుకు మౌనం వహిస్తున్నారు.?

**సామాజిక కార్యకర్త బాబా గౌడ్ లేవనెత్తుతున్న కీలక ప్రశ్నలు ఇవే..**

- తన సొంత అధికారి ఇచ్చిన నివేదికను అమలు చేయడానికి కలెక్టర్‌కు ఉన్న అడ్డంకి ఏమిటి.?
- వందల కోట్ల కుంభకోణం అని తేలినా, ఆ భూమిని తక్షణమే "నిషేధిత జాబితా" లో చేర్చకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారు.?
- ఈ అక్రమార్కులు జిల్లా యంత్రాంగం కంటే బలమైనవారా.? లేక వీరి వెనుక ఉన్న ఉన్నత స్థాయి రాజకీయ ఒత్తిళ్లకు కలెక్టర్ తలొగ్గుతున్నారా.?

"ఇది మామూలు నిర్లక్ష్యం కాదు. నానక్‌రామ్‌గూడలో భవనం కూలిన దుర్ఘటన మనం చూశాం. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారు కాబట్టి త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యత లేకుండా కడుతున్నరన్న ఆరోపణలో 'పల్లవి డి.బి.ఆర్ గార్డెనియా' భవనం కూలి ఏదైనా ప్రాణ నష్టం సంభవిస్తే, అది 'ప్రమాదం' కాదు, 'ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్య'గా పరిగణించాలి," అని సామాజిక కార్యకర్త పట్నం బాబా గౌడ్ తీవ్ర హెచ్చరిక చేశారు. ఆర్డీవో నివేదిక రూపంలో ముందస్తు హెచ్చరిక ఉన్నా చర్యలు తీసుకోకపోవడం, ఈ నేరంలో అధికారులను సైతం భాగస్వాములను చేస్తుంది. ఈ ఘోర పరిణామాలను నివారించడానికి, సామాజిక కార్యకర్త బాబా గౌడ్ జిల్లా కలెక్టర్‌ను తక్షణమే ఈ క్రింది చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

- బండ్లగూడ సర్వే నెం. 36/5 భూమిని తక్షణమే "నిషేధిత జాబితా"లో చేర్చాలి.
- "పల్లవి డి.బి.ఆర్ గార్డెనియా"కు జారీ చేసిన నిర్మాణ అనుమతులను రద్దు చేసి, నిర్మాణాన్ని నిలిపివేసి, స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి
- ఈ మొత్తం కుంభకోణంపై, బోగస్ పత్రాలు, బ్యాంక్ రుణాలపై సిబిఐ, ఈడి వంటి ఉన్నత స్థాయి దర్యాప్తుకు సిఫారసు చేయాలి.

ప్రభుత్వ భూమిని, బ్యాంకుల నిధులను, అమాయక ప్రజల ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత ఇప్పుడు పూర్తిగా జిల్లా కలెక్టర్ పైనే ఉంది. ఆయన మౌనం వీడి చర్యలు తీసుకుంటారో, లేక మరో ఘోర ప్రమాదం జరిగే వరకు వేచి చూస్తారో చూడాలి.

**"ప్రజా ప్రశ్న" దినపత్రిక తన తదుపరి కథనంలో, సర్వే నంబర్ 36/5 కు సంబంధించి వెంజెండ్ల శివ ప్రసాద్ తండ్రి పేరు వి. రామయ్య ఏ విధంగా దొంగ డాక్యుమెంట్లు సృష్టించారు, ఈ విషయంపై ఫిర్యాదుదారులు ఏ కోర్టును సంప్రదించారు, కోర్టు ఆదేశాల ప్రకారం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలు, నిందితునిపై మోపబడిన వివిధ సెక్షన్లు, మరియు ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారుల పేర్లతో సహా పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకురానుంది.**

## ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ పార్టీలకు మద్దతు ఇవ్వదు

**- మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏ ఒక్క వ్యక్తికి గానీ, రాజకీయ పార్టీకి గానీ మద్దతు ఇవ్వదని, కేవలం దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే విధానాలకు మాత్రమే కట్టుబడి ఉంటుందని ఆ సంస్థ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బెంగళూరులో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ప్రసంగ కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ ప్రశ్నకు

2లో..

## 2034 వరకు తెలంగాణలో అధికారం మాదే

**- హైదరాబాదులో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో సీఎం రేవంత్**

- జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానాలు
- కేటీఆర్ దశ బాగా లేదు, కేసీఆర్ ఎన్ని దిశలు మార్చినా ప్రయోజనం లేదు
- పుత్ర వాత్సల్యంతో కేసీఆర్ ధృతరాష్ట్రుడిలా మారారని విమర్శలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రాజకీయాలపై, ముఖ్యంగా రాబోయే ఎన్నికల భవిష్యత్తుపై సంచలన జోస్యం చెప్పారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో మాట్లాడుతూ రేపు జమిలీ ఎన్నికలు వస్తాయన్నారు. తన మాటలను గమనించాలని కోరుతూ 2028లో కాకుండా 2029 జూన్ నెలలో సాధారణ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. అంటే ఏపీతో పాటే, తెలంగాణలో కూడా సార్వత్రిక ఎన్నికలు ఒకేసారి జరగనున్నాయి. అక్కడితో ఆగకుండా 2029 నుంచి మళ్ళీ ఐదు సంవత్సరాలకు

2లో..

## ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం

**- రేపే పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు - బరిలో 58 మంది అభ్యర్థులు**

**- ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. ఆదివారం సాయంత్రం 5 గంటకు ప్రచారానికి తెరపడింది. దాంతో గత కొన్ని రోజులనుంచి మోగుతున్న మైకులు సైలెంట్ అయ్యాయి. నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా, ఈ 14న ఈసీ ఓట్లు లెక్కించి విజేతను ప్రకటించనుంది. అభ్యర్థులతో పాటు వారి పార్టీల నేతలు, సీఎం, మంత్రులు, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు బస్తీల చుట్టూ తిరిగి తమ పార్టీ అభ్యర్థి విజయం కోసం ప్రచారం నిర్వహించారు. మొత్తం 58 మంది అభ్యర్థులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో నిలవగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిచెందడంతో ఉప ఎన్నిక వచ్చిది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గోపీనాథ్ భార్య మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి సునీల్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు.


2లో..

## ఎన్ని ఉన్నా ఆరోగ్యం లేకపోతే వ్యర్థం

2లో..

**- శంకర ఐ కేర్ భవనాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

- గుంటూరు పెదకాకానిలో శంకర కంటి ఆసుపత్రి నూతన భవనం ప్రారంభం
- ఇంటి వద్దకే ప్రపంచస్థాయి వైద్యం అందించే 'సంజీవని' ప్రాజెక్టు ప్రకటన
- రాష్ట్రంలోని 5 కోట్ల మంది ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తామని వెల్లడి
- ఆరోగ్య రంగంలో ఏపీని ప్రపంచానికి రోల్ మోడల్‌గా నిలుపుతామని చంద్రబాబు ధీమా




## నా కుమారుడి మరణం ఓ మిస్టరీ

**- పోలీసులకు ఫిర్యాదు చేసిన మాగంటి గోపీనాథ్ తల్లి**

2లో..




## జపాన్‌లో భారీ భూకంపం

**- సునామీ హెచ్చరికలు జారీ**

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** జపాన్‌లో ఆదివారం భారీ భూకంపం సంభవించింది. దేశ ఈశాన్య ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్రంలో రిక్టర్ స్కేలుపై 6.7 తీవ్రతతో భూమి కంపించడంతో అధికారులు సునామీ హెచ్చరికలు

2లో..



# నా కుమారుడి మరణం ఓ మిస్టరీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దివంగత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం ఒక మిస్టరీగా మిగిలిపోయిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన తల్లి మహానంద కుమారి డిమాండ్ చేశారు. తన కొడుకు మరణానికి దారితీసిన పరిస్థితులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉపఎన్నిక జరగడానికి కేవలం రెండు రోజుల ముందు గోపీనాథ్ తల్లి, ఆయన మొదటి భార్య మాలిని, కుమారుడు తారక్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆదివారం మీడియాతో మాట్లాడిన 92 ఏళ్ల మహానంద కుమారి, తన కొడుకు మరణవార్తను సైతం తనకు సరిగ్గా తెలియజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. “నా కొడుకు జూన్ 6న చనిపోయాడో, జూన్ 8న చనిపోయాడో కూడా కన్నతల్లినైన నాకు తెలియదు,” అని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. తన కుమారుడికి వైద్యం అందించడంలో నిర్లక్ష్యం జరిగిందని ఆరోపిస్తూ శనివారం ఆమె రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఎంతో పేరు సంపాదించుకున్న తన కొడుకును ఆసుపత్రిలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా చూడనివ్వలేదని ఆమె ఆరోపించారు. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు తనను చూసేందుకు అనుమతించవద్దని దిశిర అనే వ్యక్తి సంతకంతో ఆసుపత్రి సిబ్బందికి రాతపూర్వక ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసుపత్రి నుంచి బయటకు వచ్చిన తర్వాతే గోపీనాథ్ మరణవార్తను అధికారికంగా ప్రకటించారని ఆమె గుర్తుచేశారు. గోపీనాథ్ తన మొదటి భార్య మాలినికి చట్టప్రకారం విడాకులు ఇవ్వలేదని, అయినప్పటికీ వారసత్వ ధృవపత్రంలో ఆమె పేరు, వారి కుమారుడి పేరు చేర్చలేదని మహానంద కుమారి వెల్లడించారు. తనకు న్యాయం చేయాలని కేటీఆర్‌ను చాలాసార్లు వేడుకున్నా ఆయన పట్టించుకోలేదని, కనీసం గోపీనాథ్ రెండో భార్య సునీతకు టికెట్ ఇచ్చే విషయం కూడా తమకు చెప్పలేదని ఆమె వాపోయారు. “ఇది డబ్బుల కోసం చేస్తున్న పోరాటం కాదు. మా అస్తిత్వం కోసం, మా గుర్తింపు కోసం మీడియా ముందుకు వచ్చాం,” అని ఆమె స్పష్టం చేశారు.గోపీనాథ్ కుమారుడు తారక్ మాట్లాడుతూ, తమకు చట్టపరమైన గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన చెందారు. తన తండ్రి తన తల్లికి చట్టబద్ధంగా విడాకులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. తాను విదేశాల్లో చదువుకుంటున్నప్పుడు తన గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి వస్తానని తండ్రి చెప్పారని, కానీ ఇంతలోనే ఆయన ఆకస్మికంగా మరణించారని తెలిపారు. తాను ఇండియాకు రావాల్సిన అవసరం లేదని, కేటీఆర్ అంకుల్ ఏదైనా కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పారని, తన రెజ్యూమ్ పంపితే చాలని సునీత ఫోన్‌లో చెప్పినట్లు తారక్ సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సునీత నామినేషన్ దాఖలు చేసినప్పుడు కూడా మాలిని, తారక్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తన తండ్రి మొదటి భార్యకు విడాకులు ఇవ్వనందున సునీత కేవలం సహజీవనం మాత్రమే చేశారని వారు వాదించారు. అయితే, రిటర్నింగ్ అధికారి వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా సునీత నామినేషన్‌ను ఆమోదించారు. ఉపఎన్నికల వేళ ఈ కుటుంబ వివాదం బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారింది.

# జపాన్‌లో భారీ భూకంపం

జారీ చేశారు. ఈ భూకంపం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, బుల్లెట్ రైలు సర్వీసులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5:03 గంటలకు సంరికు తీరానికి సమీపంలో, సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంపం కారణంగా ఇవాతె రాష్ట్ర తీరాన్నిమీటరు ఎత్తు వరకు సునామీ అలలు తాకే ప్రమాదం ఉందని వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఒఫునాటోలో 10 సెంటీమీటర్ల ఎత్తున, మియాకోలో ఓ మోస్తరు అలలు తీరాన్ని తాకినట్లు అధికారులు తెలిపారు. భూకంపం కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన తొహోకు షింకన్‌సెన్ బుల్లెట్ రైలు సర్వీసులను కొద్దిసేపటికే పునరుద్ధరించినట్లు ఆపరేటర్ జేఆర్ ఈస్ట్ ప్రకటించింది. ఈ ఘటనపై జపాన్ ప్రధాని సనాయె తకైచి ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. “సునామీ హెచ్చరిక జారీ చేయబడింది, కాబట్టి దయచేసి వెంటనే తీరం నుంచి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి. ఊహించిన దాని కంటే పెద్ద సునామీ రావచ్చు, కాబట్టి తదుపరి సమాచారం కోసం అప్రమత్తంగా ఉండండి. భూకంపం తర్వాత కూడా ప్రకంపనలు వచ్చే అవకాశం ఉంది” అని ఆమె ప్రజలను హెచ్చరించారు. మియాగి రాష్ట్రంలోని ఒనగావా అణు విద్యుత్ కేంద్రంలో ఎలాంటి నష్టం నమోదు కాలేదని, ప్లాంట్‌కు ఎటువంటి ప్రమాదం లేదని తొహోకు ఎలక్ట్రిక్ పవర్ సంస్థ స్పష్టం చేసింది. అయితే, రానున్న కొద్ది రోజుల్లో ఇదే తీవ్రతతో లేదా అంతకంటే శక్తివంతమైన భూకంపాలు సంభవించే ప్రమాదం ఉందని, సునామీ హెచ్చరికలున్న ప్రాంతాల్లో ప్రజలు సముద్ర తీరానికి వెళ్లవద్దని వాతావరణ సంస్థ అధికారి ఒకరు మీడియా సమావేశంలో సూచించారు.

# ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం

## పోలింగ్, ఏర్పాట్లు

జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. ఈ నియోజకవర్గంలో మొత్తం 4 లక్షల 1500 మంది ఓటర్లు ఉన్నారు. వీరి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈసీ మొత్తం 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

ఎన్నికల సందర్భంగా, నిబంధనల మేరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నేటి సాయంత్రం 6 గంటల నుంచి నవంబర్ 11 సాయంత్రం 6 గంటల వరకు వైన్స్ (మద్యం దుకాణాలు) పూర్తిగా మూసివేయనున్నారు. ఓట్ల లెక్కింపు జరిగే నవంబర్ 14వ తేదీ ఉదయం 6 గంటల నుంచి నవంబర్ 15 సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఆంక్షలు ముగిసేవరకు స్థానికేతరులు సాయంత్రం 6 గంటల తరువాత నియోజకవర్గంలో ఉండకూడదు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా తిరగవద్దని పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఓట్ల లెక్కించే నవంబర్ 14న రోడ్లపైగానీ, ఇండ్ల మధ్యగానీ క్రాకర్స్ పేల్చడం నిషేధించినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా పోలీసుల ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు హైదరాబాద్ సీపీ సజ్జనార్. పోలీసులు, ఈసీకి ప్రజలు సహకరించి ఎన్నికలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కీలకంగా ఆ రెండు ఏరియాలు

బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్లలో వచ్చే ఓట్లు విజేతను నిర్ణయించనున్నాయి. ఈ రెండు డివిజన్ల పరిధిలో 1.10 లక్షల ఓట్లు ఉండగా అంతా దిగువ మధ్య తరగతి వారే ఉంటారు. అందుకోసమే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఈ రెండు డివిజన్లలో కీలకంగా ప్రచారం నిర్వహించారు. బస్తీల్లో తిరుగుతూ ఓట్లు వేసి తమను గెలిపించాలని ఓటర్లను కోరారు.

# 2034 వరకు తెలంగాణలో అధికారం మాదే

ఎన్నికలు జరుగుతాయి అంటే 2034 జూన్ వరకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.ప్రజలు గతంలో టీడీపీకి, కాంగ్రెస్‌కి, చంద్రశేఖర్ రావుకి చెరో 10 సంవత్సరాలు అధికారాన్ని ఇచ్చారని అదే విధంగా మళ్లీ పదేళ్లు మాకే అధికారాన్ని ఇస్తారని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ పదేళ్ల కాలంలో 100 సంవత్సరాలకు కావాల్సిన అభివృద్ధిని, ప్రణాళికల్ని రచిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి అవలంభించిన విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని తెలిపారు. ఐటీ, ఫార్మా రంగాలకు వారి హయాంలో విశేష ప్రాధాన్యం లభించిందని గుర్తుచేశారు. ఐటీ రంగానికి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వేసిన పునాది నేటి హైదరాబాద్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో వచ్చిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు వంటి మౌలిక వసతులు నగరానికి జీవనాడిలా మారాయని వివరించారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులు తీసుకున్న ముందస్తు నిర్ణయాల కారణంగానే హైదరాబాద్ నగరం ‘నాలెడ్జ్ సిటీ’గా మారిందని రేవంత్ రెడ్డి అన్నారు.

2004–2014 మధ్య అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉండడం వల్ల దేశానికి వచ్చిన కేంద్ర సంస్థల్లో 70 శాతం హైదరాబాద్‌కే వచ్చాయని తెలిపారు. నేడు జీసీసీలు, డేటా సెంటర్లకు హైదరాబాద్ హబ్‌గా ఎదగడానికి ఆ నాటి కాంగ్రెస్ నిర్ణయాలే కారణమని స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ సీఎం రేవంత్ రెడ్డి పాలనా కాలాన్ని 500 రోజులు అని అంటున్న విషయాన్ని ప్రస్తావిస్తూ వ్యంగ్యంగా మాట్లాడారు. 2025 డిసెంబర్ వస్తేనే రెండేళ్లు అవుతుందని.. ఆ లెక్కన సుమారు 1000 రోజుల పైనే తమ పాలన ఉంటుందని చెప్పారు. ‘ఆయన లెక్కలు ఎలా వేస్తున్నారో, అమెరికా–ఇండియా కాలిక్యులేషన్స్ ఏమైనా వాడుతున్నారో, లేకపోతే మేలుకొని ఉన్నప్పుడే లెక్కలు పెట్టుకుంటున్నారో నాకు తెలియదు’ అంటూ చమత్కరించారు.

2004 నుంచి 2014 వరకు జరిగిన అభివృద్ధిని ఆపకుండా దాని కొనసాగింపే 2024 నుంచి 2034 వరకు ఉంటుందని ఆయన చెప్పారు. ఈ మాటల ద్వారా తమ ప్రభుత్వం గత ప్రభుత్వాల మంచిని తీసుకుంటూ దూరదృష్టితో పాలన అందిస్తుందని ప్రజలకు సందేశం ఇచ్చారు.

# ఎన్ని ఉన్నా ఆరోగ్యం లేకపోతే వ్యర్థం

అమరావతి (ప్రశ్న న్యూస్) గుంటూరు జిల్లా పెదకాకాని వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ‘శంకర ఐ సూపర్ స్పెషాలిటీ కేంద్రాన్ని’ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవాళికి, ముఖ్యంగా పేదలకు శంకర ఐ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అద్భుతమని, అమోఘమని ప్రశంసించారు. అవసరమైన వారికి దృష్టిని ప్రసాదిస్తూ ఆ సంస్థ చేస్తున్న కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. స్వామీజీ సమక్షంలో ఈ సూపర్ స్పెషాలిటీ కేంద్రాన్ని ప్రారంభించటం తన అదృష్టంగా భావిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులు తమిళనాడులో స్థాపించిన కంచి పీఠం, ధర్మం, జ్ఞానం, సేవ అనే మూడు మూల సిద్ధాంతాలపై పనిచేస్తోందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆనాటి నుంచి నేటి వరకు హిందూ ధర్మ పరిరక్షణకు కంచి పీఠం ఎంతో కృషి చేస్తోందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఆది శంకరాచార్యులు దేశంలోని నాలుగు ప్రాంతాల్లో నాలుగు పీఠాలను స్థాపించిన విషయాన్ని ప్రస్తావించారు. ‘మానవ సేవే మాధవ సేవ’ అనే సిద్ధాంతాన్ని బలంగా నమ్మే కంచి పీఠం, దేశవ్యాప్తంగా కంటి ఆసుపత్రులు స్థాపించి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని అన్నారు.శంకర ఐ ఫౌండేషన్ సాధించిన విజయాలను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ఐదు దశాబ్దాల ప్రస్థానంలో దేశంలోని 10 రాష్ట్రాల్లో 14 కంటి ఆసుపత్రులను నిర్మించి, విజయవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు 30 లక్షల మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు, 70 లక్షల మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేయడం సాధారణ విషయం కాదన్నారు. ఈ ఆసుపత్రుల్లో రోజుకు సగటున 750 ఉచిత కంటి ఆపరేషన్లు జరుగుతున్నాయని తెలిసి తాను ఆశ్చర్యపోయానని, ఇది మరే ఇతర సంస్థకు సాధ్యం కాని ప్రజా సేవ అని కొనియాడారు. కేవలం భారతదేశంలోనే కాకుండా నేపాల్, కాంబోడియా, నైజీరియా వంటి దేశాల్లోనూ సేవలందిస్తుండటం ప్రశంసనీయమన్నారు. ‘గిఫ్ట్ ఆఫ్ విజన్’ అనే గ్రామీణ సేవా ప్రాజెక్ట్ కింద 32,000కు పైగా కంటి శిబిరాలు నిర్వహించడం వారి నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.నూతనంగా ప్రారంభించిన ఈ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ బ్లాక్‌తో మన రాష్ట్రంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని, దీని ద్వారా ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా ‘రెయిన్‌బో ప్రోగ్రామ్’ ద్వారా చిన్నారుల కంటి ఆరోగ్యంపై దృష్టి సారించడాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వ లక్ష్యాలను కూడా చంద్రబాబు వివరించారు. ‘ఆరోగ్యాంధ్రప్రదేశ్’ నిర్మాణంలో భాగంగా ‘హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ’ అనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. అనారోగ్యమే నిజమైన పేదరికం అని, అందుకే ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. ప్రజారోగ్య సంరక్షణకు వినూత్న కార్యాచరణ అమలు చేస్తున్నామని, త్వరలోనే యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకురానున్నామని ప్రకటించారు. ప్రముఖ టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ ‘సంజీవని’ కేంద్రాలను త్వరలో రాష్ట్రమంతటా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం కాపాడటానికి శంకర ఐ హాస్పిటల్స్ వంటి సంస్థల సేవలను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని అన్నారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో కలిసి పనిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, పేదలకు సేవ చేసే సంస్థలకు తమ సహకారం సంపూర్ణంగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో శంకర ఐ ఆస్పత్రి నిర్వహించే స్వర్ణోత్సవాల్లో తాను కూడా పాల్గొంటానని ఆయన ఆకాంక్షించారు.

# ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ పార్టీలకు మద్దతు ఇవ్వదు

భగవత్ బదులిస్తూ, “మేము ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వం. ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనబోము. సమాజాన్ని ఏకం చేసే పనిలో సంఘ్ నిమగ్నమై ఉంది. కానీ రాజకీయాలు స్వభావరీత్యా విభజనకారిగా ఉంటాయి” అని వివరించారు. దేశానికి మేలు చేసే విధానాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, తమ ప్రభావాన్ని ఉపయోగించి సరైన విధానాలకు అండగా నిలుస్తామని తెలిపారు.“ఉదాహరణకు, అయోధ్యలో రామ మందిరం కావాలని మేము కోరుకున్నాం. ఆ లక్ష్యం కోసం నిలబడిన వారికి మా వలంటీర్లు మద్దతు ఇచ్చారు. ఆ సమయంలో బీజేపీ ఆ ఉద్యమంలో ఉంది కాబట్టి వారికి మద్దతిచ్చాం. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రామమందిర ఉద్యమానికి మద్దతు ఇచ్చి ఉంటే, మా కార్యకర్తలు ఆ పార్టీతోనే నిలబడేవారు” అని ఆయన తేల్చిచెప్పారు. “మాకు ఏ పార్టీ సొంతం కాదు, అలాగని ఏ పార్టీ పరాయిదీ కాదు. ఎందుకంటే అవన్నీ భారతీయ పార్టీలే. మేము ‘రాష్ట్ర నీతి’కి మద్దతిస్తాం, ‘రాజనీతి’కి కాదు. ఈ దేశం ఏ దిశలో పయనించాలనే దానిపై మాకు ఒక దార్శనికత ఉంది. ఆ దిశగా ఎవరు పనిచేసినా వారికి మా మద్దతు ఉంటుంది” అని భగవత్ పేర్కొన్నారు.

## జెండా వివాదంపై స్పష్టత

జాతీయ జెండాకు బదులుగా ఆర్ఎస్ఎస్ ఎందుకు కాషాయ జెండా (భగవా ధ్వజ్)ను ఉపయోగిస్తుందన్న ప్రశ్నకు ఆయన వివరణ ఇచ్చారు. “సంఘ్ 1925లో ప్రారంభమైంది. మాకు ఒక గురువు అవసరం. కానీ వ్యక్తిని గురువుగా స్వీకరిస్తే, వారికి పరిమిత ఆయుష్షు ఉంటుంది. అందుకే శాశ్వతంగా ఉండే మన సంస్కృతికి, హిందూత్వానికి ప్రతీకగా కాషాయ జెండాను గురువుగా స్వీకరించాం” అని తెలిపారు. జాతీయ జెండాను 1937లో ఖరారు చేశారని, దాని రూపకల్పన జరిగినప్పటి నుంచి తాము త్రివర్ణ పతాకాన్ని గౌరవిస్తూనే ఉన్నామని అన్నారు. “ప్రైవేట్ సంస్థలు జాతీయ జెండాను ఎగురవేయవచ్చని కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత, జనవరి 26, ఆగస్టు 15న అన్ని శాఖలలో జెండా వందనం చేస్తున్నాం. కమ్యూనిస్ట్ పార్టీకి ఎర్ర జెండా, కాంగ్రెస్‌కు వారి జెండా ఉన్నట్లే, మాకు కాషాయ జెండా ఉంది. ఇందులో వివాదం ఏమీ లేదు” అని స్పష్టం చేశారు. మీడియా విమర్శలపై స్పందిస్తూ, “ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు. కొందరి పని సంఘ్ గురించి సందేహాలు రేకెత్తించడమే. వారి విమర్శల వల్లే మాకు మరింత ఆదరణ పెరుగుతోంది. నిజం తెలిసినా కొందరు విమర్శిస్తూనే ఉంటారు. మేము వాటిని పట్టించుకోకుండా దేశం కోసం మా పని మేము చేసుకుంటూ పోతాం” అని మోహన్ భగవత్ అన్నారు.

# రెడ్‌జోన్‌లోనే ఢిల్లీ.. ప్రమాదకరంగా గాలి నాణ్యత



దేశ రాజధాని ఢిల్లీలో గాలి కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. శనివారం అనేక ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచిక 400 స్థాయిని దాటడంతో.. నగరం రెడ్‌జోన్ లోకి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఇక ఆదివారం కూడా అదే పరిస్థితి కొనసాగింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకారం.. ఇవాళ ఉదయం ఢిల్లీ – ఎన్‌సీఆర్ ప్రాంతంలో ఓవరాల్ ఏక్యూఐ 361గా నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత ప్రమాదకరస్థాయిలో కొనసాగుతోంది. వజీర్‌పూర్‌లో ఏక్యూఐ లెవెల్స్ 424గా నమోదయ్యాయి. బవానాలో 424, వివేక్ విహార్‌లో 415, రోహిణి ప్రాంతంలో 435, నెహ్రూ నగర్‌లో 426, ఆర్‌కేపురంలో 422, ఐటీవో ప్రాంతంలో 420, నోయిడాలో 391, గ్రేటర్ నోయిడాలో 366, ఘజియాబాద్‌లో 387, గురుగ్రామ్‌లో 252గా గాలి నాణ్యత సూచిక నమోదైంది. గాలి కాలుష్యానికి తోడు ఢిల్లీని దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి కాలుష్యం ప్రమాదకరస్థాయిలో ఉండటంతో రాజధాని రెడ్‌జోన్‌లోనే కొనసాగుతోంది.

# కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రం సందర్శన

- చిత్తూరు జిల్లా పలమనేరులో పర్యటించిన పవన్ కళ్యాణ్
- ఏనుగులకు స్వయంగా ఆహారం అందించిన డిప్యూటీ సీఎం
- గజరాజుల నుంచి ఆశీర్వాదం తీసుకున్న పవన్
- అనంతరం అటవీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం



చిత్తూర్ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ మదపుటేనుగుల దాడుల నుంచి పంట పొలాలను, ప్రజలను రక్షించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం ముసలమడుగు వద్ద ఉన్న ఈ కేంద్రానికి విచ్చేసిన ఆయన, ఏనుగుల శిక్షణ, వాటి సంరక్షణకు సంబంధించిన అంశాలను అధికారులను అడిగి స్వయంగా తెలుసుకున్నారు. కర్ణాటక నుంచి కొత్తగా తీసుకువచ్చిన 4 కుంకీ ఏనుగులతో పాటు, గతంలో ఇక్కడ ఉన్న మూడు కుంకీలు కూడా ప్రస్తుతం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాయి. శిక్షణలో కుంకీ ఏనుగులు ప్రదర్శిస్తున్న నైపుణ్యాలను, అలాగే ఇటీవల అవి పాల్గొన్న ఆపరేషన్ల తీరును అధికారులు ఆయనకు వివరించారు.

## ఏనుగుల ప్రదర్శన, నూతన క్యాంపు ప్రారంభం

ఈ సందర్భంగా కుంకీ ఏనుగులు చేసిన ప్రత్యేక ప్రదర్శన పవన్ కళ్యాణ్‌ను ఎంతగానో ఆకట్టుకుంది. ఏనుగులు క్రమబద్ధంగా వరుసగా వచ్చి, ఘీంకారం చేస్తూ పవన్ కళ్యాణ్ కి సెల్యూట్ చేశాయి. అనంతరం అడవిలో లభ్యమయ్యే వివిధ రకాల కలపను ఏనుగుల సహాయంతో ఎలా బయటకు తీసుకువస్తారో ప్రదర్శింపజేశారు. మనుషులు –ఏనుగుల మధ్య ఘర్షణలు తలెత్తినప్పుడు, మదపుటేనుగుల గుంపు నివాసాలు లేదా పంట పొలాల వైపు వస్తున్నప్పుడు వాటిని ఎలా నియంత్రించాలో కుంకీ ఏనుగుల ద్వారా ప్రత్యక్షంగా ప్రదర్శించారు.

## ఏనుగులకు ఆహారం అందించిన పవన్ కళ్యాణ్

మదపుటేనుగులు అదుపు తప్పినప్పుడు వాటికి ప్రత్యేకంగా మత్తు ఇచ్చి కోపాన్ని ఎలా అణిచివేస్తారో మావటీలు చూపించారు. మత్తు ఇచ్చే ఇంజెక్షన్ గన్‌ను ఆయన ఆసక్తిగా తిలకించారు. ప్రదర్శన అనంతరం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏనుగులకు స్వయంగా బెల్లం ఆహారాన్ని అందించారు. అనంతరం గజరాజుల ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో ముసలమడుగులో ఏర్పాటు చేసిన నూతన ఏనుగుల క్యాంపును పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన క్యాంపు శిలా ఫలకాన్ని, ఏనుగుల క్యాంపులో ఏర్పాటు చేయనున్న గజారామం నగర వనానికి సంబంధించిన పునాదిరాయిని కూడా ఆయన వేశారు. అంతేకాకుండా, సౌర శక్తితో పని చేసే వేలాడే అటవీ ఏనుగుల నిరోధక కంచె నిర్మాణానికి కూడా ఆయన పునాది రాయి వేశారు.

## మియావకీ ప్లాంటేషన్, మావటీలకు బహుమానం

ఈ కేంద్రం వద్దే తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు పెంచడం ద్వారా దట్టమైన అడవిని పెంపొందించే మియావకీ తరహా ప్లాంటేషన్ కార్యక్రమానికి పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. 250 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్లాంటేషన్ ను ఏర్పాటు చేయగా, ఆయన ఉసిరి మొక్కను నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మీటరుకు ఒక్కటి చొప్పున నాటిన మియావకీ ప్లాంటేషన్‌ను స్వయంగా మొబైల్‌లో వీడియో తీసుకున్నారు. మధ్యన పొదలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ఆయన అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక ప్రభుత్వం నుంచి కుంకీ ఏనుగులను స్వీకరించేటప్పుడు ఇచ్చిన హామీ మేరకు, పలమనేరు ఎలిఫెంట్ క్యాంపులో కుంకీల సంరక్షణ బాధ్యతలు చూసుకుంటున్న మావటీల పని తీరును మెచ్చుకుంటూ, పవన్ కళ్యాణ్ గారు తన సొంత డబ్బులు రూ.50 వేలు బహుమానంగా అందించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, అటవీ శాఖ సలహాదారు మల్లికార్జునరావు సహా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆదివారం యాదగిరిగుట్ట ఆదాయ రూ.1,00,57,322/-



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) కార్తీకమాసం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో ఆదివారం రోజున భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ స్వామి వారిని దర్శించుకొని పూజా కైంకర్యములు , మొక్కులు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంలో దేవస్థానంలోని వివిధ విభాగాల ద్వారా శ్రీ స్వామి వారికి ఈ రోజు రూ.1,00,57,322/– (రూపాయలు ఒక కోటి యాభై ఏడు వేల మూడు వందల ఇరవై రెండు రూపాయలు మాత్రమే) ఆదాయం సమకూరినది. ఆదివారం వచ్చిన ఆదాయం ఇటీవల కాలంలో నమోదైన అత్యధిక ఆదాయాలలో ఒకటిగా నిలిచింది. కార్తీక మాసము మూడవ ఆదివారం సందర్భంగా భక్తులు అత్యంత భక్తి శ్రద్దాలతో కొండక్రింద శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతమండపము నందు 1758 నం.లు పాతగుట్ట ఆలయం నందు 200 నం.లు వ్రతాలు మొత్తము 1958 నం.లు వ్రతాలు ఆచరించుకొనియున్నారు. కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు అధికారులు చేశారు.





మన వంటింట్లో ఎన్నో సహజ ఔషధాలు దాగున్నాయి.. మీరు తరచుగా జలుబు, ఇన్ఫెక్షన్లతో బాధపడుతుంటే.. పచ్చి వెల్లుల్లి మీకు అద్భుతంగా సహాయపడుతుంది. దీనికి బలమైన యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలు ఉన్నాయి. దీనిని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల ఎన్నో సమస్యల నుంచి బయటపడొచ్చు. వెల్లుల్లిలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. వెల్లుల్లి మన ఆహార రుచిని పెంచడమే కాకుండా.. ఇది అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న సహజ సూపర్‌ఫుడ్ కూడా.

# రెండే రెండు రెబ్బలు తింటే డాక్టర్‌తో పని ఉండదిక..

వెల్లుల్లిని ఉడికించి తిన్నా.. లేదా పచ్చిగా.. ఇలా ఎలా తిన్నా మంచిదే.. కానీ పచ్చి వెల్లుల్లి తినడం వల్ల మీకు మరిన్ని పోషకాలు లభిస్తాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. మీ రోగనిరోధక శక్తిని పెంచడం నుండి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం వరకు, ఇది మీ శరీరానికి మంచిదిగా చెబుతున్నారు. అందుకే.. మీ దినచర్యలో పచ్చి వెల్లుల్లిని చేర్చుకుంటే అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు. వెల్లుల్లిలో విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది విటమిన్ సి, విటమిన్ బి6, మాంగనీస్, ఇతర పోషకాలకు మంచి వనరు. ఇది తక్కువ కేలరీలు కలిగి ఉంటుంది.. ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మీరు తరచుగా జలుబు, ఇన్ఫెక్షన్లతో బాధపడుతుంటే, పచ్చి వెల్లుల్లి మీకు సహాయపడుతుంది. ఇది బలమైన యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలను కలిగి ఉంటుంది.. ఇది మీ శరీరం వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. ఒక అధ్యయనం ప్రకారం, పచ్చి వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది మీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. హానికరమైన బ్యాక్టీరియాను దూరంగా ఉంచుతుంది. పోషకాహార నిపుణుల ప్రకారం.. వెల్లుల్లి క్రమం తప్పకుండా తినడం వల్ల జలుబు, ఫ్లూ, ఇతర ఇన్ఫెక్షన్ల తీవ్రత తగ్గుతుంది. అధిక రక్తపోటు సైలెంట్ కిల్లర్.. అయితే.. పచ్చి వెల్లుల్లి దానిని నియంత్రణలో ఉంచడంలో సహాయపడుతుంది. వెల్లుల్లి రక్త నాళాలను సడలించి రక్త ప్రసరణను మెరుగుపరుస్తుందని, తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. వెల్లుల్లి హృదయ సంబంధ సమస్యలను నివారించడంలో ప్రభావవంతంగా ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.. మంచి కొలెస్ట్రాల్‌ను స్థిరంగా ఉంచుతుంది.. తద్వారా మొత్తం గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. మన శరీరం నిరంతరం ఆహారం, కాలుష్యం, ఇతర వనరుల నుండి విష పదార్థాలకు గురవుతూ ఉంటుంది. పచ్చి వెల్లుల్లి హానికరమైన పదార్థాలను బయటకు పంపడం ద్వారా మీ కాలేయాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఇందులో సల్ఫర్ సమ్మేళనాలు కూడా ఉంటాయి. ఇవి హెవీ మెటల్ పాయిజనింగ్ నుంచి రక్షించాయి. కాలేయం, మూత్రపిండాలు వంటి అవయవాలకు జరిగే నష్టాన్ని తగ్గిస్తాయి. ఆరోగ్యకరమైన ప్రేగు మొత్తం ఆరోగ్యానికి చాలా ముఖ్యం. వెల్లుల్లి జీర్ణక్రియను మెరుగుపరచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచుతుంది, ఇది మీ శరీరం ఆహారాన్ని మరింత సమర్థవంతంగా జీర్ణం చేసుకోవడానికి సహాయపడుతుంది. అలాగే, దాని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు హానికరమైన గట్ బాక్టీరియాను నియంత్రణలో ఉంచుతాయి. మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు మద్దతు ఇస్తాయి. డాక్టర్ బన్సాల్ ప్రకారం.. వెల్లుల్లిలో ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ ఫ్రీ రాడికల్స్ కణాల నష్టం.. వృద్ధాప్యానికి కారణమవుతాయి. పచ్చి వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కడుపు.. కొలొరెక్టల్ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది కణ ఉత్పరివర్తనను నిరోధిస్తుంది. కణితి పెరుగుదలను నెమ్మదిస్తుంది. పచ్చి వెల్లుల్లి రెండు రెబ్బలను ఉదయాన్నే తింటే చాలా మంచిది.. అయితే.. పచ్చి వెల్లుల్లి ఘాటైన రుచి మీకు నచ్చకపోతే.. ఈ చిట్కాలను అనుసరించండి. దానిని కోసి లేదా చూర్ణం చేసి తినడానికి ముందు 10 నిమిషాలు అలాగే ఉంచండి. ఇది అల్లిసిన్ మొత్తాన్ని సక్రియం చేస్తుంది. ఘాటైన రుచిని సమతుల్యం చేయడానికి తేనెతో కలపండి. తేలికపాటి రుచి కోసం స్మూతీలు లేదా సలాడ్లలో జోడించండి.

# నిద్రలో అకస్మాత్తుగా ఊపిరి ఆగిపోయినట్లు అనిపిస్తుందా?



ఇది నిశబ్దంగా మన నిద్రను భంగం కలిగిస్తుంది. తద్వారా దీర్ఘకాలిక అలసటకు దారితీస్తుంది. శ్వాస అకస్మాత్తుగా ఆగిపోయినప్పుడు వెంటనే మెలకువ వచ్చేస్తుంది. సరైన నిద్ర లభించదు. ఫలితంగా, పొద్దున్నే లేచిన తర్వాత తలనొప్పిగా ఉండడం, నీరసం, మూడ్ సరిగా ఉండకపోవడం. నిద్ర లేమికీ, శారీరక మానసిక ఆరోగ్యానికీ మధ్య ఉన్న సంబంధం గురించి అవగాహన ఏర్పడవలసిన అవసరాన్ని గతంలో కరోనా మహమ్మారి తెలియజేసింది. ఈ రోజుల్లో చాలా మందికి రకరకాల అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రతి ఒక్కరికి నిద్ర అవసరం. నిద్రలేమి వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. ప్రతి ఒక్కరికి సరైన నిద్ర లేకుంటే డయాబెటిస్‌తో పాటు కార్డియో వాస్క్యులర్ డిసీజెస్, బ్లడ్ ప్రెషర్ ఇష్యూస్, మెంటల్ హెల్త్ ఇష్యూస్ వంటివాటికి కారణం కావచ్చు. నిద్రిస్తున్న సమయంలో గొంతు భాగంలో ఉన్న కండరాలు ఎక్కువగా రిలాక్స్ అవుతాయి. దీంతో నాలుక లేదా టాన్సిల్స్ లాంటి మృదు కణ జాలాలు ఉండే భాగాలు గాలి వెళ్లే ద్వారాన్ని అడ్డుకుంటాయి. దీన్నే అబ్?స్ట్రక్టివ్? స్లీప్? ఆప్నియా అంటాం. ఈ బ్లాకేజీ కండిషన్? కొన్ని సెకండ్ల నుంచి ఒక నిమిషం పాటు ఉంటుంది. ఈ సమయంలో మెదడుకు ఆక్సిజన్ తక్కువ అందుతుంది. అలాగే ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బందిగా మారుతుంది. ఇది కొన్ని క్షణాలపాటే ఉండడం వల్ల దీనిని పెద్దగా ఎవరు గమనించి ఉండదరు. ఇది గాఢనిద్రలోకి వెళ్లకుండా అప్పుడప్పుడు అకస్మాత్తుగా మెలకువ వస్తూ ఉంటుంది. తద్వారా శరీరానికి సరిపడా నిద్ర ఉండదు. ఊపిరి తీసుకోవడంలో కలిగే ఈ ఇబ్బందులు లేదా ఆప్నియాలు ఒక్కరాత్రిలోనే పది నుంచి వందలసార్లు కూడా వస్తాయి. చాలా మందికి నిద్రలో గురక వస్తుంటుంది. దీని వల్ల చాలా మందికి ఇబ్బందిగా ఉంటుంది. దాంతో పక్కనవాళ్లు ఇబ్బంది పడడం సహజం. కానీ, గురక వల్ల ఎంతసేపు నిద్రపోయినా వాళ్లకు విశ్రాంతి తీసుకున్నట్టు అనిపించదు. కానీ, ఈ సమస్యను చాలామంది గుర్తించరు. తమంతట తాముగా గుర్తించలేరు కూడా. దీనిని అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా (ఒఎస్?ఎ) అంటారు. ఇది నిశబ్దంగా మన నిద్రను భంగం కలిగిస్తుంది. తద్వారా దీర్ఘకాలిక అలసటకు దారితీస్తుంది. శ్వాస అకస్మాత్తుగా ఆగిపోయినప్పుడు వెంటనే మెలకువ వచ్చేస్తుంది.

సరైన నిద్ర లభించదు. ఫలితంగా, పొద్దున్నే లేచిన తర్వాత తలనొప్పిగా ఉండడం, నీరసం, మూడ్ సరిగా ఉండకపోవడం, డిప్రెషన్ వంటివి కూడా కలుగవచ్చు. నిద్ర లేమి సమస్య పెరుగుతున్న కొద్దీ బ్రెయిన్ తో చేసే పనుల్లో సామర్థ్యం తగ్గుతుందని తెలుస్తోంది. పైగా రోజులు గడిచే కొద్దీ ఇది ఇంకా పెరుగుతూనే ఉంటుంది. అంతేకాదు మున్ముందు మరిన్ని సమస్యలు చుట్టుముట్టే ప్రమాదం ఉందని, ఇదో సంకేతామని వైద్యులు చెబుతున్నారు. కానీ మన శరీరంలో అప్పుడప్పుడు ఏర్పటే సంకేతాలను అర్థం చేసుకుంటే జీవితాన్ని మరింత ముందుకు

# అల్లం-నిమ్మకాయ టీతో ఆ సమస్యలకు చెక్..

కొంతమంది తిన్న తర్వాత కడుపులో అసౌకర్యానికి గురవుతారు. కడుపు ఫుల్ అయినప్పుడు లేదా కారంగా ఉండే ఆహారం తిన్నప్పుడు ఇలాంటి సమస్య తలెత్తుతుంది. కానీ అలాంటి సమయంలో మీ కడుపును కూల్ చేయడానికి, ఆహారాన్ని వేగంగా జీర్ణం చేయడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి. అల్లం-నిమ్మకాయ టీ అనేది రుచికరమైన, ఆరోగ్యకరమైన డ్రింక్. ఇది అనేక ప్రయోజనాలను కలిగి ఉంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, నొప్పి నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. అల్లం-నిమ్మకాయ టీ ఈ సమస్యలకు చక్కని పరిష్కారం. జీర్ణక్రియకు సహాయపడటం నుండి రోగనిరోధక శక్తిని పెంచడం వరకు ఈ టీ ఉపయోగపడుతుంది. ఇది చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కూడా మంచిది. ఆమ్లతను తగ్గించడానికి, బరువు తగ్గడానికి లేదా కడుపులో కలిగే ఏదైనా అసౌకర్యాన్ని తొలగించడానికి అల్లం-నిమ్మకాయ టీ చాలా బాగా పనిచేస్తుంది. అల్లం జీర్ణ ఎంజైమ్‌లను ప్రేరేపిస్తుంది. గ్యాస్, విరేచనాలు, ఆమ్లత్వం వంటి సమస్యలను తగ్గిస్తుంది. నిమ్మకాయ కాలేయాన్ని డిటాక్స్‌పై చేయడంలో, పిత్త ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది కొవ్వులను మరింత సమర్థవంతంగా తొలగించడంలో కూడా సహాయపడుతుంది. కలిపి తీసుకున్నప్పుడు, ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. భోజనం తర్వాత బద్ధకాన్ని నివారిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది చాలా మంచిది. నిపుణుల అభిప్రాయం



ప్రకారం.. అల్లం జీవక్రియను పెంచుతుంది. శరీరం కొవ్వును మరింత సమర్థవంతంగా కరిగించడానికి సహాయపడుతుంది. సిట్రిక్ యాసిడ్ అధికంగా ఉండే నిమ్మకాయ డిటాక్స్‌ఫైకి మద్దతు ఇస్తుంది. కోరికలను నియంత్రిస్తుంది. భోజనం తర్వాత క్రమం తప్పకుండా తీసుకుంటే, ఇది ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి మీకు సహాయపడుతుంది. చలికాలంలో లేదా అతిగా తిన్న తర్వాత మనం తరచుగా నీరు త్రాగడం మర్చిపోతాము. అల్లం-నిమ్మకాయ టీ హైడ్రేషన్‌ను పెంచడంతో పాటు అదనపు ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా శీతాకాలంలో దాహం తక్కువగా ఉన్నప్పుడు, ద్రవ సమతుల్యతను కాపాడుతుంది. డీహైడ్రేషన్ ప్రమాదాన్ని నివారిస్తుంది.



# రాత్రిపూట పెరుగు తింటే సమస్యలా..?

పెరుగు శరీరానికి మంచిది. జీర్ణక్రియను మెరుగుపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, పేగు ఆరోగ్యానికి పెరుగు మంచిది. పెరుగులో కాల్షియం, ప్రోటీన్ కూడా అధికంగా ఉంటాయి. ఇది ఎముకలు, కండరాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ రాత్రిపూట పెరుగు తినవచ్చా..? ఆహార నియంత్రణ ఆరోగ్యానికి చాలా ముఖ్యమైన అంశం. మనం చాలా రుచికరమైన ఆహారాలను తగ్గించాల్సి రావచ్చు. రాత్రిపూట పెరుగు తినడం కూడా నివారించాల్సిన వాటిలో ఒకటి. పెరుగు చాలా మందికి ఇష్టం. అన్నింటికంటే, ఒక కప్ పెరుగు తినాలని ప్రతి ఒక్కరికి ఉంటుంది.

కానీ రాత్రిపూట పెరుగు తినడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. రాత్రిపూట పెరుగు తినడం వల్ల జీర్ణ సమస్యలు ఉన్నవారికి మరిన్ని సమస్యలు రావచ్చు. ఇందులో కొవ్వు, ప్రోటీన్ ఉంటాయి. రాత్రిపూట జీవక్రియ తక్కువగా ఉంటుంది కాబట్టి, జీర్ణం కావడం కూడా కష్టం.ఆయుర్వేదం ప్రకారం.. పెరుగు శరీరంలో కఫాన్ని పెంచుతుంది. కఫం సాధారణంగా రాత్రిపూట ఎక్కువగా కనిపిస్తుంది. ఈ సందర్భంలో పెరుగుతో తినడం వల్ల మరిన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ సమస్యలు అందరికీ ఒకేలా ఉండకపోవచ్చు. ఉబ్బసం, దగ్గు, జలుబు ఉన్నవారు రాత్రిపూట పెరుగు తినకుండా ఉండాలి.

ఉదయం లేదా భోజనంతో పెరుగు తినడం ఉత్తమం. సరైన సమయంలో తీసుకుంటే పెరుగు శరీరానికి మంచిది. పెరుగు జీర్ణక్రియను మెరుగుపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, పేగు ఆరోగ్యాన్ని పెంచడానికి మంచిది. పెరుగులో కాల్షియం, ప్రోటీన్ కూడా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలు, కండరాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. పెరుగు జుట్టు, చర్మ ఆరోగ్యానికి కూడా మంచిది. పెరుగు ప్రోబయోటిక్స్‌కు కూడా మూలం. ఇంట్లో తయారుచేసిన తాజా పెరుగు తీసుకోవడం మంచిది. పెరుగు సాధారణంగా అందరికీ ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, పాల ఉత్పత్తులకు అలెర్జీ ఉన్నవారు దీనిని నివారించడం మంచిది. మూత్రపిండాల సమస్యలు లేదా అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు పెరుగును మితంగా మాత్రమే తినాలి.

# వర్షాకాలంలో ఆకుకూరలు తింటున్నారా..?

ఆకుకూరలు ఆరోగ్యానికి మంచివనే విషయం దాదాపు అందరికీ తెలిసిందే. ఆకు కూరలలో మన ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలు నిండి ఉంటాయి. అందుకే నిత్యం ఏదో ఒక ఆకుకూరను ఆహారంలో భాగం చేసుకోవాలని నిపుణులు చెబుతుంటారు. అయితే, వర్షాకాలంలో ఆకు కూరలు తినటం మంచిదేనా..? వర్షాకాలంలో ఆకుకూరలు తినకూడదని ఇంట్లో పెద్దలు తరచూ చెబుతుంటారు. వర్షాకాలంలో ఆకు కూరలు తింటే కడుపు నొప్పి, విరేచనాలు అవుతాయని చెబుతుంటారు. అయితే, ఇవన్నీ అపోహలు మాత్రమే అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కూరగాయలతో పోలిస్తే ఆకుకూరలు భూమికి దగ్గరగా పెరుగుతాయి. వర్షపు జల్లుల వల్ల బ్యాక్టీరియా, ఫంగస్ సులభంగా వృద్ధి చెందుతాయి. అంతేకాకుండా ఆకుకూరలపై మట్టి, కీటకాలు లేదా వాటి గుడ్లు ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి వీటన్నింటిని కారణాలుగా పేర్కొంటూ ఆకుకూరలు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని చెబుతుంటారు. వర్షాకాలంలో మన శరీరానికి అవసరమయ్యే కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, పోలిక్ ఆమ్లాలు ఆకుకూరల నుంచి ఎక్కువ మొత్తంలో లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే, రోజువారీ ఆహారంలో 50 గ్రాముల చొప్పున ఏదో ఒక ఆకుకూరని చేర్చుకోవాలని సూచిస్తున్నారు. ఆకు కూరలు వండేముందు ఉప్పు లేదా వెనిగర్ కలిపిన నీటితో రెండు లేదా మూడు సార్లు బాగా కడిగి ఎక్కువసేపు ఉడికించాలని నిపుణులు చెబుతున్నారు. ఈ కాలంలో పచ్చి ఆకుకూరలు తినడం కంటే, వాటిని బాగా ఉడికించి తినడం మంచిదని, ఇలా చేయడం వల్ల అందులో ఉండే సూక్ష్మజీవులు నశిస్తాయని చెబుతున్నారు. ఆకులు కొనే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. మురికిగా లేదా వాడిపోయిన వాటిని కొనుగోలు చేయకుండా, తాజాగా కనిపించే ఆకుకూరలనే ఎంచుకోవాలని సలహా ఇస్తున్నారు. వీలైతే సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆకుకూరలను ఎంచుకోవడం మంచిదని, ఎందుకంటే వాటిపై రసాయన అవశేషాలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.



# జగిత్యాలలో సమాచార హక్కు సాధన కమిటీ ప్రథమ వార్షికోత్సవం

**-సామాన్య ప్రజానీకానికి సమాచార హక్కు చట్టం అందజేయడమే లక్ష్యం**



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) సమాచార హక్కు చట్టం సాధన కమిటీ 9 నవంబర్ 2024 లో ప్రారంభించడం జరిగింది.సంవత్సరం కాలం అయిన సందర్భంగా జగిత్యాల జిల్లాలో ప్రథమ వార్షికోత్సవం నిర్వహించడం జరిగిందని తెలిపారు.జగిత్యాల జిల్లా అధ్యక్షుడు వోడ్నాల రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆఫీసుల్లో సామాన్య ప్రజానీకానికి సమాచార హక్కు చట్టం అందజేయడమే లక్ష్యంగా ఈ సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ద్వారా ప్రజలందరికీ దీనిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని తెలియజేశారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ మొదటి వార్షికోత్సవ కార్యక్రమాన్ని జగిత్యాల పట్టణంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. సమాచారం హక్కు చట్టం కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శులు చిప్ప నిరంజన్, గట్ల ప్రకాష్, జిల్లా కన్వీనర్ బద్రి సృజన్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లికొండ సంతోష్ కుమార్, కస్తూరి వెంకటరమణ, ఉపాధ్యక్షులు గుట్ట రమేష్, కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షులు అబ్బూరి రాజనర్సయ్య, కోరుట్ల ప్రధాన కార్యదర్శి బాలే అజయ్, కోరుట్ల అధికార ప్రతినిధి కైలాస సాయి కృష్ణ, జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షులు కంది చంద్రశేఖర రావు, జగిత్యాల నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సయ్యద్ జహంగీర్, ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షులు బుర్ర నాగరాజ్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# తాటిపల్లి శ్రీసురభి గోశాలలో ఘనంగా గోశాల వార్షికోత్సవం



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) తాటిపల్లి శ్రీసురభి గోశాలలో కార్తీకమాసం సందర్భంగా ఘనంగా గోశాల వార్షికోత్సవం ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగింది, కార్తీక మాసంలో పవిత్రంగా భావించే గో పూజలు గో దానం, కార్తిక దీపోత్సవం కనుల పండగ నిర్వహించడం జరిగిందని తెలిపారు.గోపూజ కార్యక్రమంలో భాగంగా దంపతులు విశేషంగా పాల్గొని గోవులకు ప్రత్యేక పూజలు జరిపినారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీ సురభి గోశాల అధ్యక్షులు డా. రాజారెడ్డి మాట్లాడుతూ ఆవు హిందూ సనాతన ధర్మంలో ఎంతో విశిష్టత కలిగి ఉందని, గోవు నుంచి వచ్చే మూత్రము పేడతో ప్రకృతి సేంద్రియ వ్యవసాయం చేసి ఎంతో ఉపయోగకరమైన పంటలను పండించవచ్చని, ఆవులు రక్షించి మన సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గోశాల కమిటీ సభ్యులు,వివిధ గ్రామాల ప్రజలు వివిధ స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరుల ఆశయాల సాధనకు పునరంకితమవుదాం

**పార్టీ విస్తరణకు కేశవరావు చేసిన కృషి మరువలేనిది**

**సంతాప సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని**




సుజాతనగర్ (ప్రశ్న న్యూస్) పేదవర్గాల అభ్యున్నతికోసం, పార్టీ విస్తరణకు నిరంతరం కృషిచేసిన అమరుల ఆశయాల సాధనకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పునరంకితం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సిపిఐ, ఏఐకేఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు భాగం కేశవరావు సంతాప సభ మండలంలోని కేశవరావు స్వగ్రామం కొత్త అంజనాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. సంతాపసభకు ముఖ్య అతిధిగా హాజరైన కూనంనేని, జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా తదితరులు కేశవరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాపసభలో కూనంనేని మాట్లాడుతూ సుజాతనగర్, పరిసర ప్రాంతాల్లో పార్టీ విస్తరణకు కేశవరావు యెనలేని కృషిచేశారని, అనేక ప్రజా, రైతు ఉద్యమాలు నిర్మించి సమస్యల పరిస్కారంకోసం శక్తివంచన లేకుండా కృషిచేశారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకుడిగా ప్రతి పోరాటంలో అగ్రభాగాన నిలిచాడని కొనియాడారు. అయన ఆశయాలు సాదించేందుకు నేటితరం నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా దస్రు, మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, భాగం కృష్ణ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# జోనల్ సిపి శ్రీనివాస్ యాదవ్ కనుసైగల్లో అక్రమాలు

- అక్రమాలకు సహకరిస్తున్న జోనల్, కాప్రా సర్కిల్ అధికారులు - వెంచర్ లో పార్కు స్థలం ఎక్కడో ఓనర్ చూపించాలి: కృష్ణ రెడ్డి
- మొదటగా ఓపెన్ ప్లాట్ చూపించి ఇప్పుడు అనుమతులు ఎలా తెచ్చుకున్నారు
- నాలా కన్వర్షన్ లేకుంటే అనుమతులు ఎలా ఇచ్చారు: నందికొండ శ్రీనివాస్ రెడ్డి
- ఇండస్ట్రియల్ బఫర్ జోన్ తెలిసి కూడా అనుమతులు ఇవ్వడం వెనుక లంచాలే కారణమా.?




**నాచారం (ప్రశ్న న్యూస్)** ఉప్పల్ నియోజకవర్గం లోని నాచారం నందు అన్నపూర్ణ కాలనీ సర్వేనెంబర్ 106, 107 లో నకిలీ పత్రాలు సృష్టించి గ్రామపంచాయతీ లేఅవుట్ పేరుతో ఖాళీగా వదిలిన స్థలమును ఇప్పుడు ప్లాట్ గా చిత్రీకరించి అక్రమ మార్గంలో అనుమతులు తీసుకొని వచ్చి నిర్మాణం చేస్తున్నారని స్థానిక నేత కృష్ణ రెడ్డి, నందికొండ శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గొల్ల ముత్యాలు బాయి చుట్టూ ఉన్న 19 ఎకరాల స్థలాన్ని పార్ట్ పార్ట్ లుగా వెంచర్ చేసి ప్లాట్లు అమ్మారని అయితే ఈ వెంచర్లలో పార్కుల కోసం, కమ్యూనిటీ హాల్ కోసం వదిలిన స్థలాలను ప్రభుత్వానికి అప్పగించకుండా వాళ్ల దగ్గర పెట్టుకొని ఇప్పుడు దానిపై ఒక ప్లాట్ నెంబర్ వేసి నకిలీ పత్రాలు సృష్టించి అక్రమ మార్గంలో అనుమతులు తీసుకువచ్చి అధికారులను బోల్తా కొట్టించారని పేర్కొన్నారు.విషయం తెలియడంతో బస్తీ వాసులు ఫిర్యాదు చేస్తే రెవిన్యూ అధికారులు, జిహెచ్ఎంసి అధికారులు అప్పుడు నిద్రమత్తు వీడి దీనిపై చర్యలు తీసుకోవడానికి నోటీసులు జారీ చేయడంతో పాటు నిర్మాణ పనులను కూడా మూడు, నాలుగు సార్లు అడ్డుకున్నారని తెలిపారు. అయితే జోనల్ సిపి శ్రీనివాస్ యాదవ్, స్థల యజమాని పరశురాం యాదవ్ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో ఈ అక్రమాలకు జోనల్ సిపి శ్రీనివాస్ యాదవ్ పూర్తిగా సహకరిస్తున్నారని స్థానికులు మండిపడ్డారు. ఇందులో స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేకర్ హస్తముందని ఆయన కనుసైగల్లోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ అక్రమాలలో స్థానిక రాజకీయ పార్టీల నేతలు కూడా ఉన్నారని డబ్బుకు ఆశపడి రోడ్డు, పార్కు కోసం, కమ్యూనిటీ హాల్ కోసం వదిలిపెట్టిన స్థలంలో నిర్మాణాలు చేస్తే భవిష్యత్తులో పిల్లలకు, కాలనీవాసులకు ఇబ్బంది అవుతుందని రాజకీయ నాయకులు అర్థం చేసుకోకుండా ప్యాకేజీలకు అమ్ముడుపోయారని ఆరోపించారు. ఈ సమస్యని స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దగ్గరికి తీసుకెళ్తే చర్యలు తీసుకోకుండా మౌనం వహించడం వెనక స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ హస్తం ఉందన్నారు.




### స్టే పేరుతో అధికారుల నిర్లక్ష్యం..

అక్రమ మార్గంలో బిల్డర్ నిర్మాణం చేస్తున్న ఈ అక్రమ నిర్మాణానికి కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ డిసిపి కృష్ణమోహన్, జోనల్ సిపి శ్రీనివాస్ యాదవ్ పూర్తిగా సహకరిస్తున్నారని షోకాజ్ నోటీసులు ఇచ్చిన తర్వాత ఏడు రోజులు గడువు కాలం ఇచ్చి నెల పదిహేను రోజులు ఎందుకు సమయం ఇచ్చారని వారు ప్రశ్నించారు . స్టే తీసుకోవడానికి మున్సిపల్ అధికారులే సహకరించారని అందుకోసమే స్టాండింగ్ కౌన్సిల్ సెల్ అడ్వకేట్ మంత్రి రవీందర్ అమ్ముడుపోయారని కేసుని నీరు కార్చడానికి కోర్టుకు అటెండ్ కాకపోవడం జరుగుతుందని తెలిపారు.

### జోనల్ కమిషనర్ నిర్లక్ష్యం..

ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ ఈ అక్రమాలపై స్పందించక పోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. జోనల్ కమిషనర్ కు ఎన్ని ఫిర్యాదులు చేసిన పర్మిషన్ క్యాన్సల్ కోసం ప్రధాన కార్యాలయానికి పంపామని చెప్పడం జరుగుతుందని ప్రధాన కార్యాలయంలో వెళ్లి ప్రశ్నిస్తే మాకు ఇంకా రాలేదని చెప్పడం చేస్తున్నారని ఇలా జోనల్ కమిషనర్ ప్రధాన కార్యాలయం అధికారులు మధ్యలో దోబూచులాడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఏది ఏమైనా రాజకీయ నాయకుల వత్తిడితోనే జిహెచ్ఎంసి ఉన్నత అధికారులు, కిందిస్థాయి అధికారులు అక్రమాలకు సహకరిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపించారు.

# జర్నలిస్టుపై దాడి చేసిన వ్యక్తులు అరెస్ట్.. పోలీసుల విచారణ




పటాన్ చెరు : అమీన్ పూర్ లో జర్నలిస్టు పై దాడి చేసిన వ్యక్తులను అరెస్ట్ చేశామని సీఐ నరేశ్ తెలిపారు. ఆదివారం అమీన్ పూర్‌లో జర్నలిస్టుపై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. ఈ నెల 8న రాత్రి మూడు గంటల సమయంలో జర్నలిస్ట్ విట్టల్ ఇంటిపై దాడి చేశారని చెప్పారు.దాడి చేసిన నేరస్తులైన మధు అలియాస్ మధుసూదన్, వంశీ, నల్లమల శివ ప్రసాద్, యుగేందర్, కొత్త సంపత్, కుంచాల బ్రహ్మయ్య, సల్లడి హరీష్, కోడూరి స్వరాజ్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామన్నారు. జర్నలిస్టు ఇంటిపై దాడి చేసి ఇంటి అద్దాలు పగలగొట్టడంతోపాటు జర్నలిస్టును తీవ్రంగా కొట్టారు. జర్నలిస్ట్ పై దాడి సంఘటన పోలీసులు ముందు జరిగినా కఠిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. దాడి చేసిన వారికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారు.ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్లాట్లు వేసి ఇండ్లు నిర్మాణం చేస్తున్నారని పత్రికల్లో వార్తలు రాస్తున్నారని దాడి చేసి భయాందోళనకు గురి చేశారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని సమాచారం రావడంతో అమీన్‌పూర్ తాసిల్దార్ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేస్తుండగా కొందరు దాడి చేసిందుకు ప్రయత్నం చేశారు. దాడి చేసిన వ్యక్తులను విచారించేందుకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అమీన్‌పూర్‌లో భూకబ్జాలు పెరిగిపోవడం, ప్రభుత్వ భూములు ఆక్రమించి అమ్మకాలు చేస్తున్న వారికి ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని విమర్శలు ఉన్నాయి. పోలీసులు సమగ్ర విచారణ దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు నిర్భయంగా వార్తలు రాసే జర్నలిస్టులపై దాడులు చేయడం తగదని దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ముఖేశ్ అంబానీ



కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఆసియాలోనే అత్యంత ధనవంతుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ముఖేశ్ అంబానీకి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు శాలువా కప్పి వేదాశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# భక్తులతో కిటకిటలాడిన యాదగిరిగుట్ట





యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) కార్తీక మాసం ఆదివారం సెలవు రోజు కావడంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవ స్థానానికి భక్తులు పోటెత్తారు. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. శివాలయం, కార్తీక దీపారాధన, వ్రత మండపాలతో పాటు కొండపై ఎక్కడ చూసినా భక్తుల సందడే కనిపించింది. కల్యాణకట్ట, పార్కింగ్ ఏరియా, బస్ బే, దర్శన, ప్రసాద క్యూలైన్లు రద్దీగా మారాయి. దీంతో స్వామివారి దర్శనానికి 3గంటలు. స్పెషల్ దర్శనానికి రెండు గంటలకుపైగా సమయం పట్టింది. యాదగిరిగుట్ట కార్తీ కశోభ సంతరించుకుంది. భక్తులు కార్తీక దీపాలు వెలిగించుకోవడానికి కొండపైన ప్రధానాలయ ప్రాంగణం, శివాలయం, విష్ణుపుష్కరిణి, కొండ కింద వ్రత మండపం. లక్ష్మీపుష్కరిణి వద్ద దీపా రాధన స్టాళ్లు ఏర్పాటు చేశారు. భక్తులు కుటుంబ సమేతంగా కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

# స్వర్గీయ అతికం రాములు ద్వాదశ దినకర్మలో పాల్గొన్న పలువురు ప్రముఖులు - నివాళులు



కరీంనగర్ ( ప్రశ్న న్యూస్) జర్నలిస్ట్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ తండ్రి,దివంగత అతికం రాములు ద్వాదశ దినకర్మ కార్యక్రమం ఆదివారం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా సీనియర్ జిల్లా నాయకులు అనుమల్ల చంద్రమౌళి, శ్రీ ఆంజనేయ కలర్ గ్రానైట్ అధినేత, విశ్వబ్రాహ్మణ,విశ్వకర్మ ఐక్య సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పాములపర్తి వేణుగోపాల చారితో పాటు పలువురు జర్నలిస్టులు, స్నేహితులు, బంధుమిత్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కీ.శే. అతికం రాములు సరళత, సేవాభావం



కలిగిన వ్యక్తి, ఎప్పుడూ ఇతరుల పట్ల సానుభూతితో మెలిగేవారని, ఆయన మరణం పెద్ద లోటు అని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టు రాజశేఖర్ గౌడ్ తన తండ్రి చూపిన విలువలను కొనసాగిస్తూ జర్నలిజం ద్వారా ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉన్నారని ప్రశంసించారు. అనంతరం దివంగత రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

# వివాదంలో శ్రీశివ్వంపేట పోచమ్మ-మైసమ్మ ఆలయం

**ఈ ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయాలని**

**దేవదాయ శాఖకు వినతి**

**వెంటనే స్పందించి నోటీస్ ఇచ్చిన ఎండోమెంట్ అధికారులు**

**అభ్యంతరం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు,ఆలయ కమిటీ సభ్యులు**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూరు గ్రామంలోని శ్రీ శివ్వంపేట పోచమ్మ-మైసమ్మ ఆలయ నిర్వహణ విషయంలో వివాదం నెలకొంది. పూడూరు గ్రామ నడిబొడ్డున 25సంవత్సరాల క్రితం శ్రీ శివ్వంపేట పోచమ్మ-మైసమ్మ ఆలయాన్ని నిర్మించారు. కాగా అప్పట్లో గ్రామస్తులందరూ కలిసి గ్రామంలోని వివిధ కులాలకు చెందిన వ్యక్తులను కలుపుకొని ఓ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. సదరు ఆ కమిటీ ఆధ్వర్యంలోనే మూడేళ్లకొక్కసారి బోనాల జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయం నిర్మించినప్పటి నుండి నేటి వరకు ఆలయ నిర్వహణ మొత్తం కమిటీ ఆధ్వర్యంలోని కొనసాగుతుంది. ఇది ఇలా ఉండగా గ్రామంలోని మరి కొంతమంది వ్యక్తులు సైతం కమిటీలో తమకు కూడా అవకాశం ఇవ్వాలని గత కొన్ని సంవత్సరాలుగా బోనాల జాతర ముందు ఏర్పాట్ల చర్చల సందర్భంగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. వీరి డిమాండ్ ను పరిగణలోకి తీసుకున్న కమిటీ సభ్యులు ఆసక్తి ఉన్నవారు పేర్లు ఇవ్వాలని కోరడంతో ఇచ్చారు. ఇదే సంవత్సరం మే నెలలో నిర్వహించిన జాతర ఉత్సవాలకు ముందు సైతం కమిటీ సభ్యులకు గ్రామంలోని మరి కొంతమంది వ్యక్తులకు కమిటీ నిర్వహణ విషయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో వారు జాతర ముగిసిన అనంతరం ఆగస్ట్ నెలలో శ్రీ శివంపేట పోచమ్మ-మైసమ్మ ఆలయానికి ప్రభుత్వ ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయాలని విన్నవించారు. వెంటనే స్పందించిన దేవాదాయ శాఖ అధికారులు అదే నెల 18వ తేదీన ట్రస్ట్ బోర్డు ఏర్పాటు కోసం నోటీసులు జారీచేసి ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పాలని కోరారు. ఈ ఘటన గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి ఇటీవల రావడంతో అప్రమత్తమైన కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ గ్రామస్తుల సంతకాలు సేకరించి పంపించినట్లుగా తెలిసింది.

# సమాజంలో చైతన్యం కలిగించేవే రచనలు

## డాక్టర్ కస్తూరి లక్ష్మీనారాయణ అపురూప అమెరికా పుస్తకావిష్కరణ సభలో వక్తలు

యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) సమాజంలో రచనలు చైతన్య కలిగించే విధంగా ఉండాలని పలువురు వక్తలు అన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కస్తూరి లక్ష్మీనారాయణ రచించిన అపురూప అమరిక పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్ ఎస్ కే ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన పలువురు వక్తలు మాట్లాడుతూ సమాజంలోని మంచి చెడులను ఎప్పటికప్పుడు రచనలను రచనలు ఎత్తిచూపాలని అన్నారు. రచయితలపై ఎంత గురుతరమైన బాధ్యత ఉందని సమాజాన్ని మంచి వైపుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు డాక్టర్ కస్తూరి లక్ష్మీనారాయణ గేయ రచయితగా వ్యాస రచయితగా అనేక అద్భుతమైన రచనలు చేస్తున్నారని అన్నారు. అపురూప అమెరికానే పుస్తకం ద్వారా అమెరికాలోని అనేక అంశాలను ఆయన వివరించారని అన్నారు. మానవ సంబంధాలతో పాటు అమెరికాలో ఉండేటటువంటి అనేక కోణాలను ఆయన స్పృశించారని అన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కస్తూరి లక్ష్మీనారాయణ రచన వ్యాసాన్ని అభినందించారు . లక్ష్మీనారాయణ కుమారులు కూతురు కూడా ఆయన అడుగుజాడల్లో ముందుకు నడుస్తూ వస్తున్నారని అన్నారు. వీరి కుటుంబంలో ఎక్కువ మంది డాక్టర్లు ఉన్నారని ఇటు వైద్యులుగా సమాజసేవకులుగా ఎంతో అద్భుతమైన సేవలు అందిస్తున్నారని అన్నారు. తండ్రి మాటను అనుసరిస్తూ వారి పిల్లలు కూడా ఇదే రకంగా అనేక రకాల సేవా కార్యక్రమాల్లో ముందుకు కొనసాగడం తండ్రికి తగ్గ పిల్లలు అనిపించుకోవడం చాలా మంచి విషయమని అన్నారు. అనంతరం పుస్తక రచయిత డాక్టర్ కస్తూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇటు వైద్యరంగంలో సేవలందించడంతోపాటు సాయితేరంగంలో కూడా ముందుకు కొనసాగుతున్నారని అన్నారు. అందరి అభిమానంతో ఆదరణతో తాను రచయితగా మున్ముందు మరిన్ని రచనలు చేసేందుకు కృషి చేస్తున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా రచయిత లక్ష్మీనారాయణ తన పుస్తకాన్ని దేవసాని సుదర్శనం వజ్రమ్మ దంపతులకు అంకితం ఇచ్చారు. ఈ సందర్భంగా రచయితను పలువురు సాహితీవేత్తలు స్థానికులు వివిధ రంగాల ప్రముఖులు శాలువాలతో సత్కరించి అభినందించారు. డాక్టర్ కస్తూరి లక్ష్మీనారాయణ ను యాదగిరిగుట్ట రచయితలు జర్నలిస్టుల పక్షాన యాదగిరి న్యూస్



ఎడిటర్ కైరం కొండ ప్రవీణ్ కుమార్ ప్రముఖ న్యాయవాది కొన్ని వెంకటేష్ సీనియర్ జర్నలిస్టు పుట్ట హనుమంతు జర్నలిస్టులు హరిబాబు బద్ద అమర్నాథ్ రాము ప్రసాద్ తదితరులు డాక్టర్ కస్తూరి లక్ష్మీనారాయణ ను ప్రత్యేకంగా అభినందిస్తూ శాలువాలతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు సాహితి ప్రియులు రచయితలు డాక్టర్ కె ఎల్ ఎన్ ప్రసాద్ డాక్టర్ మైథిలి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వార్షిక హార్వెస్ట్ ఫెస్టివల్ 2025

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని ఎన్జీఓస్ కాలనీలో గల సీఎస్ఐ వెస్లీ చర్చి ప్రాంగణంలో గ్రాండ్ వార్షిక హార్వెస్ట్ ఫెస్టివల్ 2025ను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలు ఆరాధన సేవలు, సమాజంలో కృతజ్ఞతతో పాటు కృతజ్ఞతా సమయాన్ని సూచిస్తుందన్నారు. ప్రతి సంవత్సరం చివరి పంట సమయాల్లో ఈ వేడుకను అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ వేడుకకు చర్చి అధ్యక్షుడు స్వామిదాస్, సెయింట్ పాట్రిక్ స్కూల్ కరస్పాండెంట్ అధ్యక్షత వహించారు. అనంతరం చర్చి ప్రాంగణంలో యూత్ ఫెలోషిప్ కార్యక్రమాలు, మార్గనిర్దేశం, ఆరాధన, సామాజిక సేవ, రుచికరమైన స్నాక్స్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫెలోషిప్ మహిళలు వండిన ఆహార పదార్థాలు, వ్యవస్థీకృత స్టాళ్లతో వచ్చిన లాభాలను చర్చి అభివృద్ధికి అందించారు. చర్చి స్టీవార్డ్ సి.శ్రీధర్ చర్చిలో





వార్షికంగా పండించిన ఆకుకూరలు, పండ్లను వేలం వేశారు. ఈ వార్షిక హార్వెస్ట్ ఫెస్టివల్ 2025 కార్యక్రమంలో సీఎస్ఐ వెస్లీ చర్చి పాస్టర్ ఎం.జే ప్రభాకర్, మహిళా ఫెలోషిప్ అధ్యక్షురాలు మేరీ దేవపాలమ్మ, చర్చి మహిళ అధ్యక్షురాలు రజిని, కార్యదర్శి స్వామిదాస్, కోశాధికారి కట్టా బెన్నెట్ సురేందర్, రెవరెండ్ సామ్యూల్, చర్చి పెద్దలు, యువత పాల్గొన్నారు.

# వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు

పటాన్ చెరు ( ప్రశ్న న్యూస్) పటాన్ చెరువు పట్టణం ముత్తంగి విజేత కాలనీ లో శివపంచాయతన సహిత ఆంజనేయ స్వామి ఆలయం లో శివపంచాయతన సహిత ఆంజనేయ స్వామి ఆలయం లో ఆరుద్ర నక్షత్ర సందర్భంగా శివాలయం లో అన్నభిషేకం మరియు సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం చేయడం జరిగింది ఆలయ అర్చకులు వంశీ పంతులు అద్వర్యం లో జరిపించడం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసము కావున సత్యనారాయణ వ్రతం ఆచరించడం వలన సర్వశుభాలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని కోరిన కోరికలు నెరవేరుతాయని పండితులు చెబుతారు. ఈ నేపథ్యంలో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భక్తులు తమ ఇళ్ల నుండి పూజా ద్రవ్యాలను తెచ్చుకొని, అత్యంత భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. ఈ సామూహిక వ్రతంలో దంపతులు తమ కుటుంబ సభ్యులతో సహా వేదికపై ఆసీనులై, పవిత్రమైన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పారాయణం, కథా శ్రవణం, మంగళ హారతులతో ఆలయ ప్రాంగణం దైవ నామస్మరణతో మార్మోగింది. పూజ అనంతరం భక్తులందరూ స్వామివారికి పండ్లు పాయసం నైవేద్యాలను సమర్పించారు.





# ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు

**పెద్ద ఎత్తున పాల్గొన్న వంజరి కులస్తులు**

**దేవాలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు**

**నిర్వహించడం శుభసూచకం : చైర్మన్ రాధాకృష్ణ**

మేడ్చల్( ప్రశ్న న్యూస్) శ్రీశ్రీశ్రీ దాక్షాయణి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో వంజరి కులస్తుల సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించడం అభినందనీయంమని రాష్ట్ర వంజరి సంఘం యువజన విభాగం ఉపాధ్యక్షులు సన్నీ కుమార్ అన్నారు. కార్తీకమాసం పురస్కరించుకొని ఆదివారం మేడ్చల్ పట్టణంలోని శ్రీశ్రీశ్రీ దాక్షాయణి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో వంజరి కులస్తుల సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వంజరి కులస్తులు భారీ సంఖ్యలో పాల్గొని పూజలను విజయవంతం చేశారు.



**అభినందించిన ఆలయ కమిటీ చైర్మన్ రాధాకృష్ణ..**

శ్రీశ్రీశ్రీ దాక్షాయిని సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలకు ముఖ్యఅతిథిగా ఆలయ కమిటీ చైర్మన్ రాధాకృష్ణ పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ రాధాకృష్ణ మాట్లాడుతూ దేవాలయ ప్రాంగణంలో ఇలా సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించడం శుభసూచకమని తెలిపారు. అదేవిధంగా వంజరి సంఘం అభివృద్ధికి ఎల్లవేళలా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గీతామధుకర్, సాటె నరేందర్, ప్రమోద్ కుమార్, ఎదుగని శేఖర్, రఘు, సింహం, వంశీ, శ్రీనివాస్ తదితరు కులస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థులకు విద్యతో పాటు కరాటే శిక్షణ అత్యంత అవసరం

**యూనివర్సల్ 369 ఫౌండర్ సాయికుమార్**

**కరాటేలో బంగారు పతకాలు సాధించిన మేడ్చల్ చిన్నారులు**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) విద్యార్థులకు విద్యతో పాటు కరాటే శిక్షణ అత్యంత అవసరమని యూనివర్సల్ 369 ఫౌండర్ జి.సాయికుమార్ అన్నారు. రానున్న రోజుల్లో మేడ్చల్ పట్టణం నుంచి అనేకమంది విద్యార్థులను కరెక్టే శిక్షకులుగా తీర్చిదిద్దుతానని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వికారాబాద్ జిల్లాలోని మోయినాబాద్ మండలంలోని మేకవనంపల్లి గ్రామంలో గల జి ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో 69వ ఎస్జిఎఫ్ రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలలో కరాటే శిక్షణ తీసుకున్న విద్యార్థులతో కలిసి ఆదివారం కరాటే టోర్నమెంట్ నిర్వహించారు.

ఈ టోర్నమెంట్లో పాల్గొన్న మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు పి.చైతన్య (అండర్ 14), (మైనస్ 35 వెయిట్) కేటగిరీలో బంగారు పతకం, జి.వరుణ్ తేజ్ (అండర్ 14) (మైనస్ 50 కేజీల వెయిట్) కేటగిరీలో, వీరభద్ర సింగ్ (అండర్ 17)(మైనస్ 50 కేజీల వెయిట్) కేటగిరిలో బంగారు పతకాలు సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థులను త్వరలో వికారాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్జిఎఫ్ పోటీలకు మరింత కఠినమైన శిక్షణ ఇచ్చి జాతీయస్థాయి పోటీలకు పంపిస్తానని యూనివర్సల్ 369 ఫౌండర్ జి.సాయికుమార్, టీం కోచ్ జి.అక్షయ మున్నా కుమార్ తెలిపారు.

## 50 ఏండ్లకు అతనికి ఊరు గుర్తొచ్చింది.. ఇన్నాళ్లు ఎక్కడున్నాడో తెలుసా..?



ఝరాసంగం : 15 సంవత్సరాల వయసులో ఉన్న ఊరు, కన్నవాళ్లు, బంధుమిత్రులను వదిలిపెట్టి ఎక్కడికో వెల్లిన వ్యక్తి 50 సంవత్సరాల తర్వాత తిరిగి తన ఆప్తులను పుట్టిన ఊరును వెతుక్కుంటూ తన ఇంటి వద్దకే నేరుగా చేరుకున్న ఘటన ఆదివారం సంగారెడ్డి జిల్లా ఝరా సంగం మండల పరిధిలోని బొప్పనపల్లి గ్రామంలో జరిగింది.ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కమ్మరి నాగప్ప, తల్లి మోహనమ్మ దంపతులకు నలుగురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. వారిలో చిన్నవాడైన సంగన్న సుమారు 50 సంవత్సరాల క్రితం తన 15వ ఏట తన గ్రామాన్ని విడిచి వెళ్లిపోయాడు. అప్పటినుంచి నేటి వరకు గ్రామానికి గాని తన కుటుంబ సభ్యులకి గాని బంధుమిత్రులకు గాని ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.అక్కడే సొంత ఇంటిని కూడా నిర్మించుకొని..వెల్లిన నాటినుండి మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా మాలేగావు తాలూకాలో చంద్రగిరి గ్రామంలో స్థిరపడ్డాడు. సంగన్న ఆ ప్రాంతపు మహిళను వివాహం చేసుకున్నాడు. వారికి నలుగురు సంతానం. అక్కడే సొంత ఇంటిని కూడా నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. అలా చూస్తుండగానే 50 ఏండ్లు కాస్తా రోజుల్లాగే గడిచిపోయాయి. ఈ క్రమంలో సంగన్నకు తన వాళు ,, తన పుట్టినిల్లు గుర్తుకు వచ్చింది. ఇక వెంటనే సంగన్న తన మూలాలను వెతుక్కుంటూ స్వగ్రామానికి చేరుకున్నాడు. సంగన్న నేరుగా తన ఇంటి వద్దకే వచ్చి కుటుంబీకులను పలకరించాడు. దీంతో ఆశ్చర్యానికి లోనవడం కుటుంబ సభ్యుల వంతైంది. ఇక సంగన్న చెప్పిన విషయాన్ని నిర్ధారించుకోవడానికి కుటుంబసభ్యులు ఆయనను పలు ప్రశ్నలు అడిగారు.అంతేకాదు ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకుని సంగన్నను పలు రకాలుగా ప్రశ్నించారు. ఆ ప్రశ్నలకు సమాధానంగా అతను గ్రామంలో ఉన్నప్పటి రోజుల్లోని పెద్దల పేర్లతోపాటు తోటి వారి పేర్లు తన తల్లిదండ్రి, కుటుంబ సభ్యుల పేర్లు అన్ని వివరించాడు. ప్రస్తుతం ఉన్న అన్నదమ్ముల ముఖ కవళికలు ఈయనతో పోలి ఉండటం.. తాను చెప్పిన కొన్ని విషయాలు వాస్తవం కావడం తన ఆధార్ కార్డులో సైతం అప్పుడు తల్లిదండ్రులు పెట్టిన పేరు ఉండడం వాస్తవానికి దగ్గరగా ఉండడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంగన్నను అక్కున చేర్చుకున్నారు.

## తన కుమారుడ్ని హత్య చేశారని వ్యక్తి ఆరోపణ.. భార్య, లెస్బియన్ భాగస్వామి అరెస్ట్





చెన్నై: తన భార్య, ఆమె లెస్బియన్ భాగస్వామి కలిసి తన కుమారుడైన పసిబిడ్డను చంపారని ఒక వ్యక్తి ఆరోపించాడు. దీని గురించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొబైల్ ఫోన్‌లో వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ ఆధారాలు అందజేశాడు. ఈ నేపథ్యంలో మహిళ, ఆమె లెస్బియన్ పార్టనర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. చిన్నాతి గ్రామానికి చెందిన 38 ఏళ్ల సురేష్, 26 ఏళ్ల భారతి భార్యాభర్తలు. అతడు దినసరి కూలీగా పని చేస్తున్నాడు. నాలుగు, ఐదేళ్ల వయస్సున్న ఇద్దరు కుమార్తెలు వారికి ఉన్నారు. ఐదు నెలల కిందట మగబిడ్డను భారతి ప్రసవించింది.కాగా, నవంబర్ 5న పసిబాబుకు పాలు పడుతుండగా అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు భారతి ఆరోపించింది. కేలమంగళం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ శిశువు మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దీంతో పసిబిడ్డ మృతదేహాన్ని ఖననం చేశారు. మరోవైపు తన కుమారుడ్ని భార్య హత్య చేసినట్లు సురేష్ అనుమానించాడు. ఆమె మొబైల్ ఫోన్ పరిశీలించాడు. దీంతో భారతి, సుమిత్ర మధ్య ఉన్న అసహజ లైంగిక సంబంధం గురించి బయటపడింది. వారిద్దరూ కలిసి దిగిన ఫొటోలు, వాయిస్ మెసేజ్‌లను సురేష్ పరిశీలించాడు. తమ సంబంధానికి అడ్డుగా ఉన్న బిడ్డను చంపినట్లు సుమిత్రతో భారతి చెప్పిన వాయిస్ మెసేజ్ అందులో ఉన్నది.కాగా, భార్య భారతి, ఆమె లెస్బియన్ భాగస్వామి సుమిత్ర కలిసి తన కుమారుడ్ని హత్య చేసినట్లు సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భార్య మొబైల్ ఫోన్‌లో ఉన్న ఆధారాలను అందజేశాడు. దీంతో పోలీసులు వాటిని పరిశీలించారు. భారతిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు.మరోవైపు బాబు పుట్టిన తర్వాత సుమిత్ర, తాను ఎక్కువ సమయం గడపలేకపోతున్నట్లు భారతి చెప్పింది. అందుకే కుమారుడ్ని చంపినట్లు ఆమె అంగీకరించిందని పోలీస్ అధికారి తెలిపారు. వారిద్దరి మధ్య మూడేళ్లుగా అసహజ లైంగిక సంబంధం ఉన్నట్లు తెలిసిందన్నారు. భారతి, సుమిత్రను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఏపీటోరియా పరిశ్రమలో స్పార్క్‌లా వచ్చి చెలరేగిన మంటలు



హత్నూర : సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోర్పట్ల శివారులోని ఏపీటోరియా యూనిట్-1 పరిశ్రమలో శనివారం రాత్రి భారీ అగ్నిప్రమాదం సంబవించినట్లు స్థానికులు తెలిపారు. పరిశ్రమలో ఈపీటీ బ్లాక్ వద్ద రసాయన పదార్థాలు శుద్ధిచేసే క్రమంలో ఒక్కసారిగా స్పార్క్ లా వచ్చి మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో పైభాగంలోని పైకప్పుకు నిప్పంటుకొని భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో ఒక్కసారిగా పరిశ్రమలోని కార్మికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాగా అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే పరిశ్రమ యాజమాన్యం అప్రమత్తమై వెంటనే మంటలను ఆదుపు చేసినట్టు పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రమాదంలో పరిశ్రమలోని పలు పరికరాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. కాగా తరచూ పరిశ్రమలలో ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో స్థానికులు, కార్మికులు భయాందోళనకు గురవుతున్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే తరచూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆరోపించారు.

## దేశంలో భారీ ఉగ్రకుట్ర భగ్నం.. ముగ్గురు అరెస్ట్



దేశంలో భారీ ఉగ్రకుట్రను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ భగ్నం చేసింది. ఈ మేరకు ముగ్గురు అనుమానితుల్ని అదుపులోకి తీసుకుంది. వారికి ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్ తో సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆయుధాలు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వారిపై ఉన్నాయని ఏటీఎస్ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఏడాది కాలంగా వారిపై నిఘా ఉంచినట్లు వెల్లడించారు. వారు దేశంలోని పలు ప్రాంతాల్లో ఉగ్రదాడులకు ప్లాన్ చేసినట్లు అధికారులు వివరించారు. ఇందులో భాగంగానే ఆయుధాల మార్పిడి కోసం గుజరాత్‌కు వచ్చినట్లు గుర్తించారు. అరెస్టయిన ముగ్గురు అనుమానితులు రెండు వేర్వేరు మాడ్యూల్‌లకు చెందినవారుగా పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది ఆరంభంలో ఐదుగురు ఆల్‌ఖైదా ఉగ్రవాదులను గుజరాత్ ఏటీఎస్ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## మిరప మొక్కకు టమాటాలు.. వంకాయలు.. ఎన్టీఆర్ జిల్లాలో వింత



మిరప మొక్కకు మిరప కాయలు మాత్రమే కాకుండా.. టమాటాలు, వంకాయలు కూడా కాస్తే ఎలా ఉంటుంది. మన పొరుగు రాష్ట్రమైన ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో ఈ అద్భుతం జరిగింది. మిరప చెట్టుకు టమాటాలు, వంకాయలు కూడా కాస్తున్నాయి. ఇప్పుడు ఈ వింత మొక్క ఆంధ్రాలో హాట్ టాపిక్‌గా మారింది.ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడుకు చెందిన రైతులు ముత్యాల రజిత రమేశ్ తన పొలంలో మిరప పంట సాగు చేస్తున్నాడు. అయితే రమేశ్ పొలంలోని ఓ మిరప మొక్కకు టమాటలు, వంకాయలు కూడా కాయడం చూసి ఆశ్చర్యపోయాడు. ఇది చూసిన పక్క పొలాల రైతులు కూడా అవాక్కయ్యారు. దీని గురించి మాట్లాడుకుంటూ ఉండటంతో ఆ నోటా ఈ నోటా ఈ విషయం చుట్టుపక్కల గ్రామాల వారికి తెలిసింది. దీంతో అందరూ ఈ అరుదైన మొక్కలను చూసేందుకు జనాలు రమేశ్ పొలానికి తరలివస్తున్నారు.కొంతమంది అయితే ఈ మొక్క వీడియోను తీసి సోషల్‌మీడియాలో కూడా పోస్టు చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వింత మొక్కపై జగ్గయ్యపేట డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి బాలాజీ స్పందించారు. ఒక్కే మొక్కకు మూడు రకాల కాయలు కాయడం వెనుక జన్యుపరమైన మార్పులే కారణం అయ్యి ఉంటుందని తెలిపారు. మిరప, టమాట, వంకాయ ఈ మూడు కూడా సొలనేసి అనే వృక్ష కుటుంబానికి చెందినవని.. అందువల్ల కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇలాంటి మార్పులు సంభవించే అవకాశం ఉంటుందని వివరించారు.

## కుప్పకూలిన హెలికాప్టర్.. ఐదుగురు మృతి



రష్యా లో ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్మీ హెలికాప్టర్ కుప్పకూలిపోయింది . ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు సంబంధించిన షాకింగ్ విజువల్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. దక్షిణ రష్యాలోని డాగేస్తాన్ ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్లిజ్యార్ నుంచి ఇజ్జెర్బాష్‌కు వెళ్తున్నKa-226 హెలికాప్టర్ తోకభాగం విరిగిపోయింది. దీంతో పైలట్ దాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయడానికి విఫలయత్నం చేశాడు. ఈ క్రమంలో హెలికాప్టర్ అదుపుతప్పి కాస్పియన్ సముద్ర తీరానికి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ గెస్ట్‌హౌస్‌పై కూలిపోయింది. అనంతరం మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్ సంఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక లోపం లేదా పైలట్ తప్పిదం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి.

## కదులుతున్న రైలు నుంచి చెత్త పడేసిన సిబ్బంది.. తర్వాత ఏం జరిగిందంటే?



న్యూఢిల్లీ: ఒక రైల్వే అటెండెంట్ కదులుతున్న రైలు నుంచి చెత్తను పడేశాడు. ఒక ప్రయాణికుడు దీనిని రికార్డ్ చేశాడు. రైల్వేకు ఫిర్యాదు చేశాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నవంబర్ 4న సీల్దా-అజ్మీర్ ఎక్స్‌ప్రెస్ రైలులోని కోచ్ అటెండెంట్ డస్ట్‌బిన్ నుంచి చెత్త కవర్ బయటకు తీశాడు. కదులుతున్న రైలు నుంచి దానిని బయటకు పడేశాడు.కాగా, ఆ కోచ్‌లో ప్రయాణించిన అభిషేక్ సింగ్ దీనిని తన మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేశాడు. చెత్తను రైలు నుంచి బయటకు పడేయడంపై కోచ్ అటెండెంట్‌ను నిలదీశాడు. అయితే ఆ చెత్తను తాను ఇంటికి తీసుకెళ్లాలా? అంటూ అతడు దురుసుగా అన్నాడు. ఈ నేపథ్యంలో ప్రయాణికుడు అభిషేక్ సింగ్ ఈ సంఘటనపై రైల్వేకు ఫిర్యాదు చేశాడు. ఈ వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో అతడు షేర్ చేయగా వైరల్ అయ్యింది. మరోవైపు ఈ ఫిర్యాదుపై రైల్వే స్పందించింది. కదులుతున్న రైలు నుంచి చెత్తను బయటకు పడేసిన కోచ్ అటెండెంట్‌ను సంజయ్ సింగ్‌గా గుర్తించినట్లు తెలిపింది. ఆ కాంట్రాక్ట్ సిబ్బందిని తక్షణమే విధుల నుంచి తొలగించినట్లు వెల్లడించింది. సంబంధిత కాంట్రాక్ట్ సంస్థకు జరిమానా విధిస్తామని వివరించింది. మరోసారి ఇలా జరుగకుండా ఆ కాంట్రాక్ట్ సంస్థను హెచ్చరిస్తామని పేర్కొంది.

## క్లాస్‌మేట్‌ను ఇంటికి రప్పించి.. ఇద్దరు విద్యార్థులు కాల్పులు



చండీగఢ్: ఒక విద్యార్థి తన క్లాస్‌మేట్‌ను ఇంటికి రప్పించాడు. మరో స్టూడెంట్‌తో కలిసి పిస్టల్‌తో అతడిపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన ఆ యువకుడు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. నిందితులైన విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీ శివారు ప్రాంతమైన హర్యానాలోని గురుగ్రామ్‌లో ఈ సంఘటన జరిగింది. సెక్టార్ 48లోని విలాసవంతమైన హౌసింగ్ సొసైటీ అయిన సెంట్రల్ పార్క్ రిసార్ట్స్‌లో నివసిస్తున్న కుటుంబాలకు చెందిన కొందరు విద్యార్థులు స్థానిక ప్రైవేట్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతున్నారు. కాగా, శనివారం రాత్రి 17 ఏళ్ల క్లాస్‌మేట్‌ను ఒక విద్యార్థి తన ఇంటికి బలవంతంగా రప్పించాడు. అక్కడ మరో స్టూడెంట్ కూడా ఉన్నాడు. గతంలో జరిగిన ఘర్షణ నేపథ్యంలో తండ్రికి చెందిన లైసెన్స్ పిస్టల్‌తో క్లాస్‌మేట్‌పై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన ఆ యువకుడ్ని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. కాల్పులకు వినియోగించిన పిస్టల్, ఒక మ్యాగజైన్, ఐదు లైవ్ కార్ట్రిడ్జ్‌లు, ఒక ఖాళీ షెల్, 65 లైవ్ కార్ట్రిడ్జ్‌లతో కూడిన మరో మ్యాగజైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. కాగా, నిందితులైన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తోటి విద్యార్థిపై కాల్పులు జరిపిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. లైసెన్స్ ఆయుధాలు పిల్లలకు అందుబాటులో లేకుండా జాగ్రత్త వహించాలని పేరెంట్స్‌కు సూచించారు.

## ఇటుకల్‌పహాడ్‌లో చిరుత సంచారం.. ఆందోళనలో గ్రామస్తులు



హైదరాబాద్ : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్(టీ) మండల పరిధిలోని ఇటుకల్‌పహాడ్ గ్రామ శివార్లలో ఓ చిరుత పులి సంచారం చేస్తోంది. ఆదివారం ఉదయం కూలీలు పత్తి ఏరేందుకు వెళ్లగా.. వారి కంట చిరుత పడింది. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన కూలీలు తిరిగి గ్రామానికి వచ్చారు. పత్తి ఏరుతుండగా పులి వచ్చి తమపై దాడి చేస్తుందేమోనన్న భయంతో కూలీలు వెనుదిరిగారు. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. తడోబా అంధేరి టైగర్ రిజర్వ్ నుంచి చిరుత తెలంగాణలోకి ప్రవేశించి ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. చిరుత సంచారం నేపథ్యంలో గ్రామస్తులు, పశువుల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మేత కోసం పశువులను అడవిలోకి తీసుకెళ్లొద్దని, పత్తి ఏరే క్రమంలో కూలీలు అల్లరి చేస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కూలీల అరుపులకు చిరుత పారిపోయే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

## ఈ ఆస్పత్రి స్టాఫ్‌కు ఆదివారం సెలవే.. శనివారం మధ్యాహ్నం వరకే డ్యూటీ..!




కుభీర్: నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నామమాత్రపు విధులు నిర్వహిస్తుండడంతో మండల ప్రజలకు ఆరోగ్య సేవలు అందడం లేదన్నది నిజం. శనివారం వచ్చిందంటే 11 గంటల నుండి సిబ్బంది ఎవరికి వారు వారి స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధమవుతారు. 12 గంటలకు ఆసుపత్రిని మూసేసి వెళ్లిపోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం 10 తర్వాతే సిబ్బంది ఆసుపత్రికి చేరుకుంటారు రెండు గంటలు పానం మీద విధులు నిర్వహించి వెళ్లిపోతారు. ఇక ఆదివారం ఎవ్వరూ రారు. డాక్టర్‌తోపాటు స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బంది ఎవరు విధులకు రారు. శనివారం, ఆదివారం నమస్తే తెలంగాణ %ూఎజ%ని సందర్శించగా 12 గంటలలోపే శనివారం ఆస్పత్రికి తాళం వేసి వెళ్లిపోయారు. ఆదివారం మాత్రం స్థానికుడైన ఫార్మాసిస్ట్ ఆనంద్ ఒక్కరే డ్యూటీలో ఉన్నారు. మిగతా సిబ్బంది ఎవ్వరూ కూడా రాలేదు. మండలంలో43 జీపీలు సుమారు 75 గ్రామాలు ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఈ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేవి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన 2 ఏళ్లకాలంగా ఒక్కరి కంటే ఒక్కరికి పురుడు పోసిన దాఖలాలు లేవు.

### బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన పీహెచ్‌సీ భవనం..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూపాయలు 90 లక్షల వ్యయంతో నూతన పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించారు. అంబులెన్స్ సౌకర్యం లేదు. డాక్టర్‌తో సహా సిబ్బంది ఎప్పుడు వస్తారు ఎప్పుడు వెళ్తారు తెలియని పరిస్థితి. ప్రతి రోజు మధ్యాహ్నం 12 దాటితే ఆసుపత్రికి తాళం ఉంటుంది. ఇంత జరుగుతున్నా జిల్లాలోని ఆ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ చొరవ చూపకపోవడంతో పేదలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలా తయారైంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సిబ్బంది సాయంత్రం వరకు విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కుబీర్‌తోపాటు మండల ప్రజలు కోరుతున్నారు.

## జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓయూ బీసీ విద్యార్థి జేఏసీ మద్దతు

**- బిసి విద్యార్థి జేఏసీ చైర్మన్ స్వామి గౌడ్**

**నవీన్ యాదవ్ గెలుపు కొరకు ప్రతి ఒక్క బీసీ విద్యార్థి పని చేయాలని స్వామి గౌడ్ పిలుపు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న మన బీసీ బిడ్డ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కొరకు ప్రతి ఒక్క బీసీ విద్యార్థి కృషి చేయాలని బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లేపల్లి స్వామి గౌడ్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా స్వామి గౌడ్ మాట్లాడుతూ పార్టీలకు,కులాలకు అతీతంగా బీసీ విద్యార్థులందరూ ఏకమై మన బహుజన బిడ్డను గెలిపించుకొని బీసీల సత్తా చాటాలని అన్నారు. ఈరోజు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల నుంచి ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉంటే కేవలం నవీన్ యాదవ్ ఒక్కరే బీసీనని ఆయన గెలుపుతోనే బీసీల భవిష్యత్ మారుతుందన్నారు. యువకుడు విద్యావంతుణ్ణి గెలిపించుకొని జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి అక్కడ ఉన్నటువంటి ప్రజలు పాటుపడాలన్నారు.ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జేఏసీ చైర్మన్ లింగం గౌడ్, తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్,బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్చార్జి గోదా రవీందర్, మహేష్,లింగాల మహేష్,అరవింద్ మరియు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## సీనియర్ పాత్రికేయుడు పెండ్యాల కు ఘన సన్మానం..!!



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) నవంబర్ 09: సికింద్రాబాద్ శ్రీపురి కాలనీ కాకా గూడలోని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ హెడ్ ఆఫీస్ లో జరిగిన కలం యోధులకు మందారమాల కార్యక్రమంలో జూలూరుపాడు కు చెంది సీనియర్ పాత్రికేయుడు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు శ్రీ పెండ్యాల విజయభాస్కర్ ను ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ప్రెసిడెంట్ ఇరుకుళ్ళ రామకృష్ణ ప్రోగ్రాం కన్వీనర్ స్పాన్సర్ శ్రీ దోసపాటి వెంకటేశ్వరరావు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సమాచార శాఖ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి చేతుల మీదుగా మెమొంటూ మీడియా రత్న అవార్డు సర్టిఫికెట్ మరియు శాలువులతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య కలం యోధులను ఒకే వేదికపై తీసుకువచ్చి ఇంతటి సత్కారం అందజేసిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఇరుకుల్ల రామకృష్ణ దోసపాటి వెంకటేశ్వరరావు సమాచార శాఖ కమిషనర్ అయోధ్య రెడ్డి వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యులకు పెండ్యాల విజయభాస్కర్ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు

## కల్లుగీత కార్మికుల హక్కుల కోసం మొకుముత్తాదులతో ఉద్యమిస్తాం




ములుగు (ప్రశ్న న్యూస్) కల్లు గీత కార్మికసంగం నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది.నూతన జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా పులి నర్సయ్య గౌడ్,అధ్యక్షులు గా గుండెబోయిన రవిగౌడ్, కార్యదర్శి గా బుర్ర శ్రీనివాస్ గౌడ్ తో పాటు జిల్లా ఉపాధ్యక్షులు గా రంగు సత్యనారాయణ గౌడ్, పులి రమేష్ గౌడ్, గాజుల ఈశ్వర్ గౌడ్, సహాయ కార్యదర్శి లుగా చిక్క అశోక్ గౌడ్,రుద్ర బోయిన మల్లేష్ గౌడ్, ఉయ్యాల మధుకర్ గౌడ్,మామిండ్ల సంపత్ గౌడ్,కమిటీ సభ్యులు గా మునిగాల సురేష్ గౌడ్, తాటి లచ్చులు గౌడ్, గడ్డం రాజ మొగిలి గౌడ్,మూల రత్నాకర్ గౌడ్, బొమ్మగాని గనేష్ గౌడ్, నక్క యాకయ్య గౌడ్ మొత్తం 16మంది తో జిల్లా కమిటీ వేయడం జరిగింది.ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు పులి నర్సయ్య గౌడ్,అధ్యక్షులు గుండెబోయిన రవిగౌడ్, కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ కల్లు గీత కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తామని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల హమలు కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని వారు అన్నారు.

## జూబ్లీహిల్స్ నుండి దీపక్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించండి

**బిజెపి సీనియర్ నాయకులు పాలకుర్తి శేషగిరిరావు**



మేడిపల్లి(ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న లంకల దీపక్ రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బిజెపి సీనియర్ నాయకులు పాలకుర్తి శేషగిరిరావు ప్రజలను కోరారు.దేశ భద్రత,ఆర్థిక సుస్థిరత, ఆర్థిక అభివృద్ధికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పాటుపడుతుందని, అందులో భాగంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి గణనీయమని తెలుపుతూ, తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల మాయాజాలం, మాటలు గారెడి తప్ప మరొకటి లేదని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమం బిజెపితోనే సాధ్యమని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ప్రజలందరూ బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న లంకల దీపక్ రెడ్డికి ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పాలకుర్తి శేషగిరిరావు రావు ఈ సందర్భంగా కోరారు.

# ఆర్భాటాలే ఆచరణ లేదు.

**మంథని కూరగాయల మార్కెట్ సముదాయాన్ని మంత్రి మర్చి పోయారా?**

**చాకలి ఐలమ్మ కూరగాయల మార్కెట్ ఎక్కడికి బదిలీ చేశారు?**

**నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే కూరగాయల మార్కెట్ సముదాయాన్ని నిర్మాణం ఎక్కడ జరిగేది?**







మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలోని చాకలి ఐలమ్మ కూరగాయల మార్కెట్ సముదాయాన్ని నిత్యము ప్రజలకు చేదోడు వాదోడుగా ఉండే మార్కెట్ గత 50 సంవత్సరాల నుండి పేద ప్రజలకు చిన్న చిట్కా వ్యాపారం చేసుకోవడానికి అనుకూలంగా ఉండేది. గతము నుండి మార్కెటు దేరాలతో ఉన్నటువంటి మార్కెట్ చిరస్థాయిగా ప్రజలకు ఉపయోగపడే విధంగా నిత్యము వ్యాపార కేంద్రంగా నడుస్తున్నటువంటి మార్కెట్ను అడ్డుకొని కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలల పరిపాలనలో శిలాఫలకం వేసి దాదాపుగా పది నెలలు కావస్తుంది ఆర్భాటాలే కానీ ఆచరణకు నోచుకోలేదు. మార్కెట్ నెత్తి వేయడానికి గల కారణాలు ప్రజలకు అర్థం కావడం లేదు కూరగాయల మార్కెట్లో పూస వేరులోళ్లు చిన్నచిన్న చిల్లర కోట్లతో వ్యాపారం చేసుకొని జీవనం గడిపే నిరుపేదలు ఎంతోమంది ఈ మార్కెట్ మీద ఆధారపడి జీవిస్తున్నారు ఇదే మార్కెట్ సముదాయంలో మటన్, చికెన్, చేపల మార్కెట్ నిత్యవసర సరుకుల కూరగాయలు సంబంధించిన దుకాణాలు మంథని మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చే నిరుపేద మహిళలు కూరగాయలను తెచ్చుకొని వాటిని అదే మార్కెట్లో అమ్ముకొని వచ్చిన డబ్బులతో జీవనం సాగించే సామాన్య ప్రజలు ఎందరో ఈ మార్కెట్ మీద ఆధారపడి జీవిస్తున్నారు. అభివృద్ధి అంటే కాంగ్రెస్. కాంగ్రెస్ అంటే అభివృద్ధి అని చెప్పుకునే వాళ్ళు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే సందంగా మంత్రి వ్యవహరిస్తున్నారనేది ప్రజలలో ఒక రకమైన చర్చ. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పాలనని అనేక పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ ఏ పథకము ద్వారా చాకలి ఐలమ్మ కూరగాయల మార్కెట్ను తరలించడం జరుగుతుంది ఇట్టి విషయాలను రాష్ట్ర ప్రభుత్వం గ్రహించి మంథని నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసే మంత్రి దానిని మరిచిపోతే మార్కెట్ లోని ప్రజలు ఎవరికి చెప్పుకోవాలి ప్రజలు వివిధ రకాలుగా చర్చించుకుంటున్నారు ఈ మార్కెట్ సముదాయం కాంట్రాక్టుట్ బడా బాబుల కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్లి సామాన్య ప్రజలకు తీరని అవస్థలు పెట్టే విధంగా మంత్రి వ్యవహరిస్తున్నారని ప్రజల ఆరోపణ ఇప్పటికైనా మంత్రి మంథని అభివృద్ధిపై దృష్టి పెట్టి రాబోయే రోజులను గుర్తుపెట్టుకొని అభివృద్ధి చేస్తే ప్రజల్లోకి వెళ్లే విధంగా ఉంటుంది ఒకవేళ దానినీ ప్రజలు ప్రతీది గుర్తుంచుకుంటారని మంత్రి గమనించాలి. ప్రజా ప్రభుత్వాలకు ప్రజలే చరిత్ర నిర్మాతలు వాళ్లు తలుచుకుంటే ఎంతటి వారినైనా ఓడగొట్టగలుగుతారనేది నిత్య సత్యం ఇది ప్రతి ఒక్కరు గమనించాలని లేకుంటే పురోభివృద్ధికి నాంది పలికిన వారు అవుతారని ప్రజల ఆరోపణ. కూరగాయల మార్కెట్ పైన చుట్టుపక్కల ప్రాంతాల వారు వచ్చి పదో వర్కో సంపాదించుకునే మంథని కేంద్రంగా ఉంటే వారి యొక్క జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకునే కేంద్రంగా కూరగాయల మార్కెట్ ఉంటే అభివృద్ధి అని చెప్పి వారి మనగడలను నిరాశలకు గురిచేస్తున్నారు ఇకనుండి అయినా ఎమ్మెల్యే తన చుట్టూ ఉండే వారి మాటలు నమ్మి అసలు పేదవానికి న్యాయం జరిగే విధంగా వ్యవహరించడం లేదు ఇది వారు తెలుసుకొని పేద ప్రజలకు న్యాయం చేస్తే చిరస్థాయిగా పేద ప్రజల గుండెల్లో నిలుస్తారు. లేకుంటే రాబోయే ఎలక్షన్లో పేద ప్రజలే బాబాసాహెబ్ అందించిన విలువైన ఓటు ద్వారా ప్రభుత్వానికి తగిన మూల్యం చెల్లిస్తారు. మంథని నియోజకవర్గంలో పీవీ తరువాత గెలిచిన అత్యున్నత విద్యారతలు కలిగిన వ్యక్తి శ్రీధర్ బాబు అన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు కానీ ఉన్నత చదువులు పేదవానికి ఉపయోగపడే విధంగా ఉండాలి. అభివృద్ధి చేస్తలేరు అనే విధంగా ఉండకూడదని ప్రజలు రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

## భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి: ఈవో వెంకటరావు

**ట్రాఫిక్ జాబ్ కాకుండా ఎప్పటికప్పుడు పరిరక్షణ జరగాలి**

**భక్తులను, వాళ్ల బ్యాగులను ఎప్పటికప్పుడు స్క్రీనింగ్ చేయాలి**

**గుట్టపైన వైద్యులు, అంబులెన్స్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి**

**గర్భిణీలకు పిల్లలకు వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు దర్శనం కల్పించాలి**

**విధుల పట్ల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు ఈవో హెచ్చరిక**





యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో భక్తుల సదుపాయములు, దేవస్థాన భద్రత విషయమై కొండపైన కొండక్రింద ప్రాంతాలలో ఈవో వెంకటరావు బ్యాగేజీ స్క్రీనింగ్ వ్యవస్థ ఏర్పాటునకు గాను సంబందించి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, ఆలయ అధికారులు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, యాదగిరిగుట్ట వారితో విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా బ్యాగేజ్ కౌంటర్ల స్థాపన, వినియోగం వంటి అంశాలను పరిశీలించి, భక్తుల సౌకర్యార్థం సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి వాహనం కొండపైకి ప్రవేశించే ముందు పూర్తిగా స్కానింగ్ చేయబడాలని భద్రతా దృష్ట్యా ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేయుటకు ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపబడుతున్నది. ఈ కమిటీ ద్వారా ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రాంతాల్లో బ్యాగేజ్ స్కానర్లు ఏర్పాటు చేయడం ప్రతిపాదించబడింది. అలాగే వాహన పార్కింగ్ సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, కొండపైన కొండక్రింద ప్రాంతాలలో పార్కింగ్ వ్యవస్థను మెరుగుపరచాలని సూచించారు. ఆలయంలో భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు మరింత కఠినతరం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనం, ప్రతి భక్తుని ప్రవేశ సమయంలో స్కానింగ్ తప్పనిసరి చేయాలని, ఏ విభాగమూ నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. అలాగే ట్రాఫిక్ సమస్యల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, భక్తుల రాకపోకలు సులభంగా జరిగేలా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని ఆదేశించారు. తదుపరి, కొండపైన గల వైద్యశాలను కూడా తనిఖీ చేశారు. ఎల్లప్పుడూ అంబులెన్స్ అందుబాటులో ఉండేలా, అత్యవసర వైద్య సదుపాయాలు నిరంతరంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వికలాంగులు, గర్భిణీ మహిళలు, వృద్ధ భక్తులు వంటి వారాలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని , ప్రత్యేక సౌకర్యాలు కల్పించి, వారికి ఆలయ దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. పై ప్రకారం తక్షణం అమలు చేయవలసిందిగా సంబంధిత శాఖలకు కార్యనిర్వాహణాధికారి వెంకటరావు ఆదేశాలు జారీ చేసియున్నారు. భక్తుల సౌకర్యం, భద్రత కోసం అవసరమైన ఏర్పాట్లు ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. భక్తుల సౌకర్యం, భద్రత దేవస్థాన ప్రదాన లక్ష్యం అని ఈవో తెలియజేశారు.

## స్తంభంపల్లిలో దుర్ఘటన - విద్యుదాఘాతంతో ఆవు మృతి

**- రాష్ట్ర ప్రభుత్వం, సెస్ విద్యుత్ సంస్థ ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో ఆదివారం దుర్ఘటన జరిగింది. స్థానిక రైతు ముత్యపు పరశురాంకు చెందిన ఆవు వ్యవసాయ క్షేత్రంలో మేత మేస్తుండగా, అక్కడ ఉన్న ఇనుప స్తంభానికి దగ్గరగా వెళ్లి విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్తులు ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం ,సెస్ అధికారులు ఆర్థిక సాయం అందించాలి అని విజ్ఞప్తి చేశారు. అలాగే, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వేలాడే వైర్లు, విద్యుత్ స్తంభాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## విప్లవ వీరనారి రంగవల్లిని స్మరణ - ప్రజా గ్రంథాలయాలపై చర్చ

**- రంగవల్లి విజ్ఞాన కేంద్రంలో కరపత్రాల ఆవిష్కరణ**





వేములవాడ ( ప్రశ్న న్యూస్) రంగవల్లి విజ్ఞాన కేంద్రం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నవంబర్ 11న "సంక్షోభ కాలం – సామాజిక మార్పు, ప్రజా గ్రంథాలయాల ఆవశ్యకత" అనే అంశాలపై రంగవల్లి స్మారకోపాన్యాసాలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం వేములవాడలోని రంగవల్లి విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాజేశ్వరి, చెన్నమనేని పురుషోత్తం రావు, పోకల సాయికుమార్, ప్రజా సంఘాల నాయకులు లక్ష్మి, లత, అంజగౌడ్, నందం, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "సామాజిక సంక్షోభాల నడుమ ప్రజా గ్రంథాలయాల పాత్ర అత్యంత ముఖ్యమైనదని, అవి ప్రజల ఆలోచనా స్వాతంత్ర్యానికి అద్దం పట్టే వేదికలుగా ఉండాలని" పేర్కొన్నారు. రంగవల్లి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరగబోయే ఈ స్మారకోపాన్యాసాలకు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ స్మారకోపాన్యాసాలకు ముఖ్య వక్తలుగా అరుణోదయ సాంస్కృతిక సమైక్య గౌరవాధ్యక్షురాలు, ఆర్.వి.కే అధ్యక్షురాలు విమలక్క, రచయిత్రి, సామాజిక ఉద్యమకారిణి ప్రొ. కొల్లాపురం విమల, ప్రముఖ కవి జూకంటి జగన్నాథం తదితరులు హాజరుకానున్నారు. కామ్రేడ్ రంగవల్లి భారత విప్లవోద్యమం అందించిన వీరనారీమణుల్లో ఒకరని, ఆమె ఉన్నత విద్యావంతురాలిగా, మార్క్సిస్టు విజ్ఞానవేత్తగా, స్త్రీ విముక్తి కార్యకర్తగా, ప్రజా విముక్తి సేనానిగా తన జీవితం అంతా సమాజానికి అంకితం చేసిందని నిర్వాహకులు తెలిపారు.1999 నవంబర్ 11న జరిగిన ఎన్కౌంటర్లో రంగవల్లి వీరమరణం పొందినప్పటికీ, ఆమె విప్లవ ఔన్నత్యం, త్యాగం, మానవతా విలువలు నేటికీ సమాజాన్ని స్ఫూర్తి పరుస్తున్నాయని అన్నారు.నేటి పరిస్థితుల్లో ఎటువంటి అత్యవసర పరిస్థితి లేకుండానే ప్రజల రాజ్యాంగ హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని, కులవివక్ష, పరువు హత్యలు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం వేములవాడ నంది కమాన్ సమీపంలోని రంగవల్లి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో జరగనుందని, కవులు,కళాకారులు ,ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# పత్తాలేని తూనికలు కొలతల శాఖ అధికారులు

- ఫిర్యాదులొస్తేనే మేల్కొనే అధికారులు - వ్యాపారుల మోసం, అవినీతి పాలన, తూనికల కొలతల శాఖ ఎక్కడ.?
- తూకంలో మోసాలు అయిన అడ్రస్ ఉండని అధికారులు - కాలం చెల్లిన వస్తువుల అమ్మకాలు అయిన పట్టుకోరు
- ఎంఆర్ పి కంటే అధిక ధరలకు అమ్మకాలు అయిన పట్టింపు ఏది.?

(ఆర్ కె - ప్రశ్న న్యూస్ బ్యూరో)





ప్రజల రోజువారీ జీవితంలో ముఖ్య పాత్ర పోషించే తూనికలు,కొలతల శాఖ (లీగల్ మెట్రాలజీ శాఖ) ఇప్పుడు అవినీతి మయమైపోయిందని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు అధికారులు డ్యూటీ చేస్తున్నారా.? చేస్తే ఎక్కడ దాడులు చేస్తున్నారు. ప్రజలను మోసం చేస్తున్న వాళ్లను పట్టుకొని కేసులు బుక్ చేస్తున్నారో వాళ్లకే తెలియాలి. ఈ శాఖపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్న పట్టించుకునే నాధుడే లేకుండా పోయారు పాలకులు కూడా అంతే ఈ శాఖపై దృష్టి పెట్టారు ఈ శాఖలో పనిచేసే అధికారులకు ప్రతినెల కూర్చున్న కాడనే మామూలు వస్తాయన్న ఆరోపణలు ఉన్నాయి.

### తూనికలు- కొలతలు శాఖ విధులు..

ప్రజలకు సరైన కొలతలు, సరైన ధరలకు సరైన ఉత్పత్తులు అందించడమే. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తే, ఈ శాఖ అధికారులు తనిఖీలు చేయడానికే కాకుండా, కళ్లుమూసుకొని రిలాక్స్ మోడ్‌లో ఉన్నట్టు కనిపిస్తోంది. ఒక్క అధికారి కూడా డ్యూటీ చేస్తున్నాడు లేదో ప్రభుత్వానికే తెలియాలి. ఈ అధికారుల ఫోన్ నెంబర్లు కూడా ఎక్కడ కనిపించవు కేవలం మెయిల్ ఆధారంగా ఫిర్యాదులు వస్తేనే చర్యలు తీసుకుంటారా లేకుంటే విశ్రాంతి తీసుకుంటారా అన్నట్లుగా మారింది పరిస్థితి.

### దుకాణాల నుండి పెట్రోల్ బంకుల వరకు అవకతవకల రాజ్యం..



చాలా రిటైల్ షాపులు, బేకరీలు,సూపర్ మార్కెట్లు, పెట్రోల్ బంకులు ు ఎక్కడ చూసినా తూనికల్లో తేడా, కొలతల్లో మోసం, కాలం చెల్లిన వస్తువుల అమ్మకాలు సాధారణం అయిపోయింది. లీగల్ మెట్రాలజీ స్టాంప్ గడువు ముగిసిన తూకాలు, మోసపూరిత డిజిటల్ తూనిక పరికరాలు బహిరంగంగానే వాడుతున్నారు. పెట్రోల్ బంకుల్లో లీటరు తక్కువగా ఇంధనం ఇవ్వడం, వినియోగదారుల దగ్గర చిన్న మొత్తాలుగా దోపిడీ చేయడం అనేది పాత సూత్రమే అయిపోయింది. ఇలా మోసాలు జరుగుతున్న అధికారులు మాత్రం దాడులు చేయకుండా నిమ్మకు నీరతనట్లు వ్యవహరిస్తున్నారు.

### ఫిర్యాదులు వస్తేనే చర్యలు.? లేకుంటే 'రిలాక్స్' డ్యూటీ..

ఈ శాఖ ప్రధాన బాధ్యత : నియమిత తనిఖీలు చేయడం, మోసపూరిత పరికరాలను సీజ్ చేయడం, జరిమానాలు విధించడం. కేసులో నమోదు చేయడం కానీ నేటి పరిస్థితి మాత్రం విరుద్ధంగా ఉంది.
సాధారణంగా ఏదైనా పెద్ద ఫిర్యాదు మీడియా ద్వారా బయటపడితేనే అధికారులు కదలి వస్తారు. లేదంటే "సర్వం సవ్యమే" అన్నట్టు నిద్రపోతారు.
ప్రజలు, వినియోగదారులు ఫిర్యాదులు చేయకపోతే ు అధికారుల దృష్టి దుకాణాల వైపు వెళ్ళడం లేదు. నెల నెల మామూళ్లు తీసుకొని డ్యూటీ సరిగ్గా చేయరన్న ఆరోపణలు ఉన్నాయి.

### అవినీతి జాలంలో తూనికల కొలతల శాఖ.?

స్థానిక వ్యాపారులు చెప్పే మాటల ప్రకారం, తనిఖీలు పేరుతో వస్తున్న అధికారులు "పెట్టె" పద్ధతిలో వసూళ్లు చేస్తూ, లంచం తీసుకొని సర్టిఫికెట్‌లు ఇస్తున్నారట.? చాలా సార్లు గడువు ముగిసిన పరికరాలపైనా సీల్ కొట్టి "క్రమబద్ధం" చేసినట్లు చూపిస్తారట.?ఇలా లంచం ఆధారంగా కదిలే వ్యవస్థతో ప్రజల నమ్మకం పూర్తిగా కూలిపోయింది. తూనికల కొలతల శాఖ అసలు ఉందన్న సంగతి ప్రజలు మర్చిపోతున్నారు. ఎందుకంటే అధికారులు డ్యూటీ చేయడం మానేశారు. అవినీతి అక్రమాలు చేసే వాళ్ళతో నిత్యం మోసపోతానే ఉన్నారు.

### చట్టం ఉన్నా అమలు లేని స్థితి..

తూనికలు కొలతల చట్టం 2009 ప్రకారం ు
గడువు ముగిసిన పరికరాలను వాడితే,
మోసపూరిత తూనికలు ఉంచితే,
తప్పుడు కొలతలతో వినియోగదారులను మోసగిస్తే, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్ముతేజైలు శిక్ష,భారీ జరిమానాలు విధించే అధికారం ఈ శాఖకుంది.కానీ ఈ చట్టం ఫైళ్లలో మాత్రమే మిగిలిపోయింది.తనిఖీలు జరగకపోవడంతో వినియోగదారుల రక్షణ లేకుండా పోతోంది.

### అధికారులారా నిద్రను వీడి పనిచేయండి..

ప్రజలు ఇప్పుడు ఈ శాఖపై గళమెత్తుతున్నారు, అధికారులు సక్రమంగా డ్యూటీ చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు.
"మా పైసల్ చెల్లించే ప్రతి రూపాయికి సరైన కొలత కావాలి. తూనికలు కొలతల శాఖ ఫిర్యాదుల కోసం కాకుండా, స్వయంగా పర్యవేక్షణకు రావాలి" అని కోరుతున్నారు.తూనికలు, కొలతల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలకు దిగి, తనిఖీలు చేస్తేనే అవినీతి తగ్గుతుంది. లేనిపక్షంలో 'నిద్రపోతున్న శాఖ' అనే ముద్ర తొలగే అవకాశం లేదు.ప్రజల హక్కుల కోసం ఉన్న శాఖ, ప్రజలే మోసపోవడాన్ని ఎందుకు చూస్తోందని యావత్ ప్రజలు తూనికల కొలతల శాఖా అధికారులను ప్రశ్నిస్తున్నారు.

# ముని్సపల్ అధికారి అక్రమ నిర్మాణం చేస్తే

- సర్కిల్ అధికారులు సహకరిస్తుంటే - ప్రభుత్వ నిబంధనలు కాగితాలకేనా.?
- ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవడం మర్చిపోయారా.?
- సికింద్రాబాద్ జోనల్ పరిధిలో సర్కిల్ అధికారుల అవినీతి దందా.?
- షోకాజ్ నోటీసులు ఇవ్వడంలో జోనల్ కమిషనర్ వెనుకడిగేందుకు.?

**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ అధికారులు అక్రమాలు చేస్తే చర్యలు తీసుకోవాలి. అక్రమాలకు అవినీతికి అడ్డుకట్ట వేయాలి. కానీ ప్రభుత్వ అధికారులే అక్రమాలకు అవినీతికి సహకరిస్తూ అక్రమాలు దర్జాగా చేస్తున్నారు చర్యలు తీసుకునే నాధుడే లేకపోవడంతో వాళ్లు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది పాలన. గతంలో ప్రభుత్వ అధికారులు ఏదైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే ప్రజలు ఫిర్యాదు చేసిన పత్రికల్లో కథనాలు వచ్చిన వాళ్లపైన విచారణ చేసి శాఖపరమైన చర్యలు తీసుకునేవారు. కానీ ప్రస్తుత కాలంలో ప్రభుత్వ అధికారులు అనేక అక్రమాలు చేస్తున్న పత్రికలో కథనాలు వచ్చిన సాక్షాత్ ముఖ్యమంత్రి కార్యాలయంలో ఏసీబీ కార్యాలయంలో విజిలెన్స్ కార్యాలయంలో సాక్షాదారాలతో ఫిర్యాదులు చేసిన చర్యలు తీసుకునే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వ అధికారులలో భయం లేకుండా పోయింది మేము ఎన్ని అక్రమాలు చేసిన అవినీతికి పాల్పడ్డ పట్టుకునే వాడు లేడు అన్నట్లుగా మారింది పరిస్థితి ఇది దీనికి అంతా కారణం ప్రభుత్వ వైఫల్యమే అని ప్రజలు మండిపడుతున్నారు.




### ముని్సపల్ అధికారి అక్రమ నిర్మాణం చేస్తే..

జిహెచ్ఎంసి అధికారి జిహెచ్ఎంసి కే కుచ్చుటోపి పెడుతున్నాడు. ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించవలసిన అధికారులు వాటిని తుంగలో తొక్కి అక్రమ నిర్మాణం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బన్సీ లాల్ పెట్ డివిజన్ కృష్ణానగర్ లో ఇంటి నెంబర్ 6-4-481/7, ముని్సపల్ శాఖలో పనిచేసే అధికారి రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని అదనపు అంతస్తులు నిర్మించడంతోపాటు ఎలాంటి సెట్ బ్యాక్ లు పాటించడం లేదని దీనిపై బేగంపేట సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందన లేకపోవడంపై ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఉన్నతాధికారులు ఫిర్యాదులపై ఎందుకు స్పందించడం లేదు.?

ప్రభుత్వ అధికారులు అవినీతికి అక్రమాలకు పాల్పడుతుంటే స్థానికులు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదని శాఖ పరమైన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కిందిస్థాయి అధికారులు సిబ్బంది తప్పు చేస్తే ఉన్నతాధికారు చర్యలు తీసుకోవాలి కదా మరి తీసుకోకుంటే వ్యవస్థలు అందరూ అవినీతి అక్రమాలు చేసుకుంటూ పోతే ప్రభుత్వానియమని బంధాలను ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ప్రజల కోసమే నా ప్రభుత్వ నియమ నిబంధనలను అధికారులకు వర్తించవా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ముని్సపల్ శాఖలో పనిచేసే అధికారి ముని్సపల్ శాఖకి కుచ్చుటోపి పెట్టి నష్టం చేస్తుంటే మరి జోనల్ కమిషనర్, జిహెచ్ఎంసి కమిషనర్ ఇలాంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాలి.

# 'ఒక్క ఛాన్స్' పొరపాటు వద్దు

- బీహార్ ఓటర్లకు నారా లోకేశ్ పిలుపు




పాట్నా (ప్రశ్న న్యూస్) బీహార్ రాష్ట్ర అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగాలంటే, అక్కడ మరోసారి ఎన్డీయే ప్రభుత్వానికే పట్టం కట్టాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ ఆ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే కూటమి అధికారంలో ఉండే 'డబుల్ ఇంజిన్ సర్కార్'తోనే ఇది సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ ప్రచారానికి చివరి రోజైన ఆదివారం నాడు ఆయన పాట్నాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం బీహార్ అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని, ఇలాంటి కీలక సమయంలో ప్రభుత్వ మార్పు జరిగితే మొత్తం ప్రక్రియ గాడి తప్పుతుందని లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ తప్పిదాన్ని ఆయన ఉదాహరణగా చూపించారు. "మా రాష్ట్రంలో 'ఒక్క ఛాన్స్ ఇవ్వండి' అంటూ వైసీపీ అధికారంలోకి వచ్చింది. వారు పాలన చేపట్టిన తర్వాత అనేక పరిశ్రమలు రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోయాయి. పెట్టుబడులు ఆగిపోయాయి. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని బీహార్ ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలి" అని లోకేశ్ హితవు పలికారు.
"బీహార్ అభివృద్ధికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం చాలా అవసరం.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కలిసి పనిచేస్తేనే బీహార్ కలలు సాకారమవుతాయి. ప్రస్తుతం అభివృద్ధి అనే విమానం రన్‌వేపై టేకాఫ్ కోసం సిద్ధంగా ఉంది. ఇది ఆగిపోవాల్సిన సమయం కాదు. అందుకే, మా కూటమికి ఐదోసారి అధికారం ఇవ్వండి. మేమంతా కలిసి రాష్ట్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి కాకముందు బీహార్‌లో 'జంగిల్ రాజ్' నడిచిందని లోకేశ్ గుర్తుచేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చిన తర్వాతే రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. "నేను పాట్నాలోని పారిశ్రామికవేత్తలతో మాట్లాడాను. ఇక్కడి ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి పనులపై వారు ఎంతో సంతోషంగా ఉన్నారు. కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కు అత్యధిక నిధులు కేటాయించారు. ఆ తర్వాత స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉంది. రెండు రాష్ట్రాల్లో ఎన్డీయే అధికారంలో ఉండటం వల్లే ఇది సాధ్యమైంది" అని ఆయన వివరించారు.
ప్రధానంగా మూడు కారణాల వల్ల బీహార్‌లో ఎన్డీయే గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ నొక్కిచెప్పారు. నాయకత్వ పనితీరు, డబుల్ ఇంజిన్ ప్రభుత్వం, ప్రభుత్వాల కొనసాగింపు అనేవి రాష్ట్ర పురోగతికి కీలకమన్నారు. 'వికసిత భారత్' లక్ష్యాలను చేరుకోవడంలో బీహార్ పాత్ర చాలా ముఖ్యమైనదని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం యువత ఎన్డీయే విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో భాగంగా లోకేశ్ బీహార్ ఇండస్ట్రీస్ అసోసియేషన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతోనూ సమావేశమయ్యారు. రాష్ట్రాలు బలపడినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని, సరైన సమయంలో దేశ ప్రజలు సరైన నాయకుడిని ప్రధానిగా ఎన్నుకున్నారని, ఫలితంగా గత దశాబ్ద కాలంలో భారత్ అపూర్వమైన అభివృద్ధిని సాధించిందని ఆయన పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో సైబర్ మోసాల మోత

- రోజుకి రూ.1 కోటి నష్టం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రజల ఆశ, భయాన్ని ఆసరాగా చేసుకుని జరుపుతున్న మోసాల కారణంగా నగరవాసులు సగటున రోజుకు రూ.1 కోటి నష్టపోతున్నారని పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. ఈ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పోలీసు శాఖ 'జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆదివారం నాడు డీజీపీ బి. శివధర్ రెడ్డితో కలిసి కమిషనర్ సజ్జనార్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 'సైబర్ సింబా' లోగో, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించి, వాలంటీర్లకు బ్యాడ్జీలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. గత దశాబ్ద కాలంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఇది ఇప్పుడు ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వీయ అవగాహనతోనే ఈ నేరాలను అరికట్టగలమని, అందుకే తెలంగాణ వ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. "నేరగాళ్లు వ్యక్తుల సంపద, వయసు, చిరునామా వంటి వివరాలు సులభంగా సేకరించి ఫోన్ కాల్స్, సోషల్ మీడియా ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ఒంటరిగా ఉండే మహిళలు, వృద్ధులు, గృహిణులను లక్ష్యంగా చేసుకుని, వారిని భయపెట్టి డబ్బులు కాజేస్తున్నారు" అని ఆయన వివరించారు.ప్రతి ఇంట్లో సైబర్ మోసాలపై అవగాహన ఉన్న ఒక్క 'సైబర్ సింబా' ఉన్నా, సమాజం మొత్తం సురక్షితంగా ఉంటుందని డీజీపీ అన్నారు. ఈ ఉద్యమంలో యువత, విశ్రాంత ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేరాలను నిరోధించేందుకు 'సైబర్ పెట్రోలింగ్' కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ, అనుమానాస్పద కాల్స్, లింకులు, యాప్‌లను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, బలమైన పాస్‌వర్డ్‌లు వినియోగించాలని సలహా ఇచ్చారు. సైబర్ మోసాల బారిన పడిన బాధితులు తక్షణమే 1930 నంబర్‌కు కాల్ చేయాలని, లేదా వెబ్ సైట్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. అనంతరం, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో సజ్జనార్ 'సైబర్ ప్రతిజ్ఞ' చేయించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588